




TELANGANA VANI TELUGU DAILY

R N I No. APTEL/2012/53127

# తెలంగాణ వాణి

తెలుగు దినపత్రిక








సంపుటి: 16 | సంచిక : 74 | బుధవారం 8. 7. 2026 | ఎడిటర్: జేరిపోతుల సంపత్ | కరీంనగర్ | పేజీలు 8 | వెల: 5.00




## మాజీ ఎమ్మెల్యే కొమ్మిడి నరసింహారెడ్డి మృతికి సీఎం రేవంత్ రెడ్డి సంతాపం

- 300 ఎకరాలు దానం చేసిన నిరాడంబర వీరుడు
- 1969 తొలి దశ తెలంగాణ ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్న నర్సింహారెడ్డి..
- గోదావరి జలాల సాధన కోసం, అలాగే మూసీ నది పరిరక్షణ కోసం ఆయన సాగించిన ఉద్యమాలు చేశారు.

## పార్టీ పేరు ఖరారుపై ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించిన కవిత

ఢిల్లీ: పార్టీ పేరు ఖరారుపై కల్వకుంట్ల కవిత ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించారు. తెలంగాణ రక్షణ సమితి పేరు తన పార్టీకి కేటాయించాలని కోరుతూ పిటిషన్ దాఖలు చేశారు. తమ పార్టీ పేరును ఖరారు చేయడానికి ఎన్నికల సంఘం అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ జూన్ 23న లేఖ పంపిందని పిటిషన్‌లో పేర్కొన్నారు. తమకు ప్రత్యామ్నాయమైన పార్టీ పేర్లు చెప్పాలి తప్ప.. టీఆర్ఎస్ వచ్చే విధంగా ఎలాంటి పేరు ఉండొద్దని ఈసీ తెలిపిందని కోర్టు దృష్టికి తెచ్చారు. తెలంగాణ రక్షణ సేన పేరు టీఆర్ఎస్‌కు అర్థం వచ్చేలా ఉందని, ఈసీ నోటీసుకు సరైన రీతిలో సమాధానం చెప్పాలని ఢిల్లీ హైకోర్టు స్పష్టం చేసింది.

## మనవడికి గాయం..

- ఏఐజీ ఆస్పత్రికి కేసీఆర్
- నిన్న గేమ్స్ ఆడుతుండగా అతడి ముక్కుకు గాయం
- ఆస్పత్రికి చేరుకున్న మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు



## ప్రియుడితో కలిసి భర్తను చంపేసి..

- మృతదేహాన్ని మహారాష్ట్ర సరిహద్దుకు తీసుకెళ్లి పూడ్చి
- భర్త కనిపించడం లేదంటూ పోలీసులకు ఫిర్యాదు
- ఈ ఘటన గతేడాది నవంబర్‌లో జరగ్గా
- తాజాగా కీలక విషయాలు వెలుగులోకి



# యాదగిరిగుట్టలో భూముల కేటాయింపునకు స్పష్టమైన విధానం రూపొందించాలి

- తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- యాదగిరిగుట్ట ఆలయ అభివృద్ధిపై ఎంసీఆర్ హెచ్‌ఆర్డీ బోధి పెవిలియన్‌లో నిర్వహించిన ఉన్నతస్థాయి సమీక్ష
- భూముల కేటాయింపులో తిరుమల తిరుపతి దేవస్థానం అనుసరిస్తున్న విధానాన్ని అధ్యయనం చేయాలి
- హరే రామ హరే కృష్ణ చారిటబుల్ ఫౌండేషన్‌కు మార్కెట్ ధర ప్రకారం భూమి కేటాయించాలి
- టీటీడీ విధానంలోనే దశలవారీగా అనుమతులు మంజూరు చేయాలి
- కుల సంఘాలకు భూముల కేటాయింపుపై కూడా స్పష్టమైన నిబంధనలతో కూడిన విధానాన్ని రూపొందించాలి
- ఆలయ నిర్మాణంపై ఇంజినీర్ల కమిటీ సమర్పించిన నివేదికను సమగ్రంగా పరిశీలించి వారంలో నివేదిక అందజేయాలి

హైదరాబాద్ తెలంగాణ వాణి)

## పరిపాలనలో పూర్తి స్థాయి డిజిటలైజేషన్‌కు కార్యాచరణ రూపొందించాలి

పరిపాలనలో మరింత పారదర్శకత, జవాబుదారీతనం తీసుకురావడానికి ప్రభుత్వ వ్యవస్థను పూర్తిస్థాయిలో డిజిటలైజ్ చేయాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో డిజిటల్ గవర్నెన్స్ అమలుకు సమగ్ర ప్రణాళికలు రూపొందించి, అవసరమైన చట్టాలను తీసుకురావాలని సూచించారు. ఎంసీఆర్ హెచ్‌ఆర్‌డీలోని బోధి పెవిలియన్‌లో కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలపై నిర్వహించిన ఉన్నతస్థాయి సమీక్ష సమావేశంలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ, ప్రభుత్వ సేవలు ప్రజలకు వేగంగా, పారదర్శకంగా అందేలా డిజిటల్ గవర్నెన్స్‌ను అమలు చేయాలని అన్నారు. సంక్షేమ పథకాల లబ్ధి నేరుగా అర్హులైన వారికి చేరే విధంగా వ్యవస్థను రూపొందించాలని సూచించారు. ప్రభుత్వ ఉద్యోగులతో పాటు కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ప్రతి నెల ఒకటో తేదీన జీతాలు అందేలా ఉద్యోగుల వివరాలు, జీతాలు, బ్యాంకు ఖాతా సమాచారం పూర్తిగా డిజిటలైజ్ చేయాలని ఆదేశించారు. రాష్ట్రంలో సుమారు 4,800 కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీలు ఉండగా, వాటిలో 4,300 ఏజెన్సీలు ఉద్యోగులకు ఈఎస్ఐ, పీఎఫ్ చెల్లించడం లేదని, ప్రభుత్వం నిధులు విడుదల చేసినప్పటికీ ఉద్యోగులకు సమయానికి జీతాలు అందడం లేదని అధికారులు వివరించారు..

# ప్రజలకు మెరుగైన రహదారులే ప్రభుత్వ లక్ష్యం

- భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు.
- తొర్రూరు డివిజన్‌లో రూ.338 కోట్ల వ్యయంతో పనులు ప్రారంభం
- రాష్ట్ర అభివృద్ధికి నాణ్యమైన రహదారులు, ప్రభుత్వ పాఠశాలలు, వైద్య రంగం బలోపేతం
- నియోజకవర్గ రూపురేఖలను మార్చేందుకు ప్రభుత్వం కృషి

హైదరాబాద్ తెలంగాణ వాణి)



## ఖైరతాబాద్ ఆర్టీవో కార్యాలయం వద్ద తీవ్ర ఉద్రిక్తత..

- గేట్లు బద్దలుకొట్టి లోపలికి దూసుకెళ్లిన కార్మికులు
- ట్రాఫిక్ పోలీసులు, ఆర్టీఏ అధికారులు విధిస్తున్న భారీ జరిమానాలు
- పెద్ద సంఖ్యలో నిరసన ర్యాలీగా తరలివచ్చిన కార్మికులు,
- అడ్డుకోవడానికి పోలీసులు ప్రయత్నించడంతో వాగ్వాదం
- రూ. 15,000 నుండి 25,000 జరిమానాలపై ఆగ్రహం..




## జూలై 10న విద్యా సంస్థల బంద్

- వామపక్ష విద్యార్థి సంఘాలు బంద్‌కు పిలుపు
- రాష్ట్రంలో ఉన్న 27 వేల ప్రభుత్వ పాఠశాలలను 4 వేలకు కుదించాలి
- ప్రైవేట్,కార్పొరేట్ విద్యా వ్యాపారాన్ని అరికట్టి, ఫీజుల నియంత్రణ చట్టాన్ని చేయాలి

## 2 లక్షల ఉద్యోగాల హామీపై శ్వేతప్రత్రం విడుదల చేయాలి

- బీజేపీ ప్రతి పక్షనేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి
- సీఎం రేవంత్ రెడ్డికి బహిరంగ లేఖ
- 20 వేల పోలీస్ ఖాళీలకు గాను కేవలం 7,437 పోస్టుల నోటిఫికేషన్ ఇవ్వడమేంటి..
- పోలీస్ ఉద్యోగాల భర్తీ ప్రకటన యువతలో తీవ్ర గందరగోళం
- జీవో నెం.46 కారణంగా గ్రామీణ ప్రాంతాలకు చెందిన ప్రతిభావంతులైన అభ్యర్థులకు తీవ్ర అన్యాయం



## సింగరేణి చేతికి తాడిచర్ల-2 బొగ్గు గనులు




- కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి
- ఆ బొగ్గు గనులకు సంబంధించి తాను సంతకం చేశాను
- తాడిచర్ల-2లో 182 మి.టన్నుల బొగ్గు ఉత్పత్తికి అవకాశం
- మరో 40-50 ఏళ్లపాటు బొగ్గు ఉత్పత్తి
- ‘ఇతర రాష్ట్రాల్లో సింగరేణి సంస్థ బొగ్గు వేలంలో పాల్గొనేలా చేస్తున్నాం.
- నైని కోల్ బ్లాక్‌లో 340 మిలియన్ టన్నుల బొగ్గు నిల్వలు ఉన్నాయి.
- ఇవి దాదాపు 30-35 ఏళ్లు సరిపోతాయి
- నైని కోల్ బ్లాక్‌లో ఏటా 10 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి కోసం సింగరేణికి అవకాశం కల్పించాం.
- బొగ్గు ఉత్పత్తితో సింగరేణికి రూ.75 వేల కోట్ల రెవెన్యూ వచ్చే అవకాశం ఉంది.

హైదరాబాద్ తెలంగాణ వాణి)



## ఇ-20 పెట్రోల్‌తో సమస్య వచ్చిన ఒక్క కారు చూపించండి

20 శాతం ఇథనాల్ కలిపిన పెట్రోల్ వాడకం వల్ల వాహనాల ఇంధన సామర్థ్యం తగ్గుతుందంటూ వస్తున్న ఆరోపణలను కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ తోసిపుచ్చారు. ఇ-20 పెట్రోల్ వల్ల సమస్య వచ్చిన ఒక్క కారు పేరు అయినా చెప్పాలన్నారు. ఇథనాల్ బ్లెండింగ్‌పై కావాలనే విమర్శకులు తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారు. ఓ కార్యక్రమంలో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. “ఇ -20 పెట్రోల్ వాడకం వల్ల ఇప్పటివరకూ ఎలాంటి ఫిర్యాదులు అందలేదు. ఇ20 పెట్రోల్ కారణంగా సమస్య ఎదుర్కొంటున్న ఒక్క కారునైనా చూపించండి. ఇథనాల్ బ్లెండింగ్‌పై జరుగుతోన్న ప్రచారం కేవలం పెయిడ్ క్యాంపెయిన్. అందులో వాస్తవం లేదు” అని ఆయన కొట్టిపారేశారు. దేశం ఏటా ఇంధన దిగుమతుల కోసం రూ.22 లక్షల కోట్లు ఖర్చు చేస్తోందన్నారు.ఇథనాల్ తయారు చేయాలనే నిర్ణయంతో రైతులకు దాదాపు రూ.45వేల కోట్ల అదనపు ఆదాయం వస్తుందన్నారు.

## తెలంగాణ టూరిజం అభివృద్ధికి రోడ్‌మ్యాప్ సిద్ధం చేయండి

- పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు
- పర్యాటక ప్రాంతాల అభివృద్ధి, సరికొత్త పర్యాటక అనుభవాలు,
- టూరిజం అభివృద్ధి మరియు ప్రమోషన్‌పై నిర్వహించిన విస్తృత స్థాయి సమీక్షా సమావేశం
- అమ్రాబాద్, కావల్ టైగర్ రిజర్వులకు ప్రత్యేక ప్రణాళిక
- గ్రాండ్ టూరిజం కార్నివల్‌కు ప్రతిపాదన
- హైదరాబాద్‌లో కొత్త టూరిజం ఆకర్షణలు
- సోమశిలలో ఉన్న సుమారు 1,600 ఎకరాల భూమిని సమర్థవంతంగా వినియోగించాలి

హైదరాబాద్ తెలంగాణ వాణి)



## బీజేపీ నేతవా లేక బీఆర్ఎస్ ఏజెంట్‌వా?

- ఈటల వ్యాఖ్యలకు పీసీసీ చీఫ్ కౌంటర్
- కన్నెపల్లి పంప్‌హౌస్ నుంచి నీళ్లు తీయొద్దని కేంద్ర ప్రభుత్వ పరిధిలోని నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ చెప్పింది.
- ఈటల రాజేందర్ ఈ రెండు నాలుకల ధోరణి ఏంటి?
- బీజేపీ లైన్ ఉందా, బీఆర్ఎస్ స్క్రిప్ట్ ఉందా అనేది తెలంగాణ సమాజం గమనిస్తోంది



## అత్యున్నత పురస్కారంతో ప్రధాని మోదీని సత్కరించిన ఇండోనేషియా

- బిన్‌టాంగ్ ఆదిపూర్ణ అవార్డుతో సన్మానం
- ప్రస్తుతం మోదీ ఇండోనేషియా పర్యటన
- ఈ గౌరవం కోట్లాది మంది భారతీయులకు చెందుతుంది
- ఇండోనేషియా అధ్యక్షుడు ప్రబోవో సుబియాంటోకు తన హృదయపూర్వక కృతజ్ఞతలు




## తెలంగాణలో 3 రోజుల పాటు వర్షాలు

- 50 నుండి 60 కి.మీ వేగంతో ఈదురుగాలులు
- ఈ నెల 10 వరకు వర్షాలు కొనసాగే అవకాశం
- తెలంగాణ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది.

# సంపాదకీయం

## విచ్చలవిడిగా యాంటీ బయాటిక్స్ వాడకంతో పొంచి ఉన్న పెను ప్రమాదం

యాంటీబయాటిక్స్.. మన ఆరోగ్యానికి అత్యంత ప్రమాదంగా మారుతున్నటువంటి పరిస్థితి ఉంది. ముఖ్యంగా గ్రామాలలో యాంటీబయాటిక్స్ వినియోగం అధికంగా ఉండడం ఆందోళన కలిగిస్తుంది. చిన్నచిన్న అనారోగ్యాలకు సైతం యాంటీ బయాటిక్స్ వినియోగించడం గ్రామాలలో ప్రధానంగా కనిపిస్తుంది. యాంటీ బయాటిక్స్ వాడకం గురించి గ్రామాలలో సరైన అవగాహన లేకపోవడం కారణంగా, ప్రజలు వాటి గురించి తెలియక విపరీతంగా వినియోగిస్తున్నారు.

**విచ్చలవిడిగా యాంటీ బయాటిక్స్ వాడకం**

అంతేకాదు జలుబు, దగ్గు, జ్వరం వంటి చిన్న చిన్న అనారోగ్య సమస్యలకు కూడా యాంటీబయాటిక్స్ ను ఉపయోగిస్తే త్వరగా ఉపశమనం కలుగుతుందని భావించి వాటిని వాడుతున్నారు. ఇంకా కొన్ని గ్రామాలలో ఇప్పటికీ సరైన వైద్య సహాయం లేకపోవడం వల్ల మెడికల్ షాపులలో అడిగి యాంటీబయాటిక్స్ కొనుగోలు చేసి వాటిని వినియోగిస్తున్న పరిస్థితులు ప్రస్తుతం గ్రామాలలో ఉన్నాయి. అయితే ఇది ఏమాత్రం మంచిది కాదని వైద్య నిపుణులు చెబుతున్నారు.

**యాంటీ బయాటిక్స్ రెసిస్టెన్స్ సమస్య**

వీటివల్ల అనేక దుష్ప్రభావాలను ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరిస్తున్నారు. విపరీతంగా యాంటీబయాటిక్స్ వాడటం వల్ల బాక్టీరియా అభివృద్ధి చెందినప్పుడు యాంటీబయాటిక్ రెసిస్టెన్స్ సంభవిస్తుంది, ఫలితంగా మనం వాడిన మందులు ప్రభావవంతంగా ఉండవు. గ్రామీణ ప్రాంతాలలో, ఇది యాంటీబయాటిక్స్ అధిక వినియోగం ఒక ముఖ్యమైన సమస్యగా మారుతోంది. ఈ ప్రాంతాలలోని అనేక మంది ప్రజలు ప్రిస్క్రిప్షన్‌ల లేకుండా స్థానిక ఫార్మసీలపై ఆధారపడి ఇష్టారాజ్యంగా యాంటీబయాటిక్స్ వాడటం వల్ల ఇది రెసిస్టెన్స్ ప్రమాదాన్ని పెంచుతుంది.

**యాంటీబయాటిక్స్ సైడ్ ఎఫెక్ట్స్**

యాంటీబయాటిక్స్ వినియోగం వల్ల అనేక దుష్ప్రభావాలు కూడా కలుగుతాయి. కొన్ని రకాల యాంటీబయాటిక్స్ సైడ్ ఎఫెక్ట్స్ కు కారణమవుతాయి. వాంతులు, విరోచనాలు, వికారం, ఎలర్జీ వంటి ఇతర సమస్యలకు కూడా కారణమవుతాయి. ఇక అవసరం లేనప్పుడు యాంటీబయాటిక్స్ వాడడం అనవసరమైన ఆరోగ్య సమస్యలకు కారణమవుతుంది. నిజంగా అవసరం అయినప్పుడు యాంటీబయాటిక్స్ సరిగా పనిచేయని పరిస్థితి వస్తుంది. ఇది అనవసరమైన వైద్య ఖర్చులకు కారణంగా మారుతుంది.

**గ్రామాల్లో యాంటీ బయాటిక్స్ వాడకం తగ్గించేలా ఇలా చెయ్యాలి**

ముఖ్యంగా గ్రామాలలో ఉన్నటువంటి ఈ సమస్యను తగ్గించడానికి గ్రామీణ ప్రాంతాలలో ఉన్న ప్రజలను యాంటీబయాటిక్స్ వాడకం విషయంలో చైతన్యవంతుల్ని చేయాలి. అంతేకాదు గ్రామీణ ప్రాంతాలలో వైద్య సేవలను మెరుగుపరిచి, మెడికల్ షాపులలో నేరుగా మందులు ఇచ్చే విధానాన్ని అరికట్టాలి. వైద్య సలహా లేకుండా యాంటీబయాటిక్స్ వాడకుండా నిరోధించేలా చర్యలు తీసుకోవాలి.

## అర్హులైన ఓటర్లను ఎస్ఐఆర్ ప్రక్రియలో నమోదు చేయించాలి

ఎస్ఆర్ఐ ప్రక్రియలో బూతు స్థాయి ఏజెంట్లు అందరూ భాగస్వాములు కావాలని శాసనసభ సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ తెలిపారు. మంగళవారం. వికారాబాద్ పట్టణంలోని సత్య భారతి ఫంక్షన్ హాల్లో ప్రత్యేక సమగ్ర సవరణపై వికారాబాద్ మున్సిపాలిటీ బూతు స్థాయి ఏజెంట్లు మున్సిపల్ కౌన్సిలర్ల తో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన శాసనసభ సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరు ఓటర్ గా నమోదయ్యే విధంగా చూడాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. కేంద్ర ఎన్నికల సంఘం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఎస్ఐఆర్ ప్రక్రియను విజయవంతం చేయాలని ఆయన సూచించారు. ఎస్ఆర్ఐ ప్రక్రియ ప్రక్రియ సజావుగా జరిగే విధంగా బిఎల్ఎలు యువత అధికారులకు సహకరించాలని ఆయన తెలిపారు. గ్రామాల్లో మున్సిపల్ పరిధిలో అర్హులైన ప్రతి ఒక్కరిని ఓటర్ కార్డ్ నమోదు అయ్యేవిధంగా ప్రజా ప్రతినిధులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. ప్రతి ఓటర్ కు ఎన్యూమరేషన్ ఫారాలు అందే విధంగా బిఎల్ఏ లు బిఎల్ఓ లు సమన్వయంతో పని చేయాలని సభాపతి సూచించారు. ఈ సమావేశంలో తహసీల్దార్ లక్ష్మీనారాయణ మున్సిపల్ వైస్ చైర్మన్ అర్థ సుధాకర్ రెడ్డి ఎస్ఐఆర్ ట్రైనింగ్ కోఆర్డినేటర్ చైతన్య కృష్ణారెడ్డి మున్సిపల్ కౌన్సిలర్లు బూతు స్థాయి ఏజెంట్లు పాల్గొన్నారు.

## ప్రజలకు మెరుగైన రహదారులే ప్రభుత్వ లక్ష్యం: మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి



తుర్కయంజాల్: ప్రజలకు సౌకర్యవంతమైన రహదారులు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం వందల కోట్ల రూపాయలు వెచ్చిస్తోందని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. మంగళవారం ఆదిభట్ల సర్కిల్ పరిధిలోని తొర్రూరు డివిజన్‌లో రూ.338 కోట్ల వ్యయంతో హ్యామ్ విధానంలో చేపట్టనున్న నాలుగు లైన్ల ఆధునిక రహదారుల నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, రాష్ట్ర రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రామ్‌రెడ్డి, చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధికి నాణ్యమైన రహదారులు, ప్రభుత్వ పాఠశాలలు, వైద్య రంగం బలోపేతం కావడం అత్యంత కీలకమన్నారు. ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో రూ.338 కోట్లతో ఆధునిక రహదారులు నిర్మిస్తున్నామని, అదనంగా రూ.100 కోట్లతో ఇతర రహదారుల అభివృద్ధికి కూడా చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రతి ఇంటికీ చేరవేస్తున్నామని, మరో ఐదేళ్లు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో కొనసాగుతుందనీ భీమా వ్యక్తం చేశారు. అనంతరం భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ హ్యామ్ విధానంలో నియోజకవర్గంలోని 140 రహదారులను అభివృద్ధి చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. గత పదేళ్లలో జరగని అభివృద్ధి కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వేగంగా జరుగుతోందని పేర్కొన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ప్రజాపాలన సమర్థవంతంగా కొనసాగుతోందన్నారు.

ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతో ఇబ్రహీంపట్నం నియోజకవర్గ రూపురేఖలను మార్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఆరుట్లలో అన్ని సౌకర్యాలతో తెలంగాణ ప్రభుత్వ పాఠశాలను అందుబాటులోకి తీసుకువచ్చామని తెలిపారు. కోహెడలో రూ.2,300 కోట్లతో ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌ను ఏర్పాటు చేయడం వల్ల స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని చెప్పారు. గత ప్రభుత్వం కమిషన్ల కోసమే ఫార్మాసిటీ ప్రాజెక్టును తీసుకువచ్చిందని ఆరోపించిన ఆయన, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత దానిని రద్దు చేసి ఫ్యూచర్ సిటీకి శ్రీకారం చుట్టిందన్నారు. దీంతో ప్రాంతీయ అభివృద్ధి వేగవంతమవుతుందని, ప్రజల అవసరాలకు అనుగుణంగా మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ శంకర్ నాయక్, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి, రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షురాలు కొత్త కురుమ మంగమ్మ, యువ నాయకులు అభిషేక్ రెడ్డి, గడ్డి అన్నారం మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్ రెడ్డి, వైస్ చైర్మన్ భాస్కర చారి, తొర్రూరు డివిజన్ అధ్యక్షులు కోశిక ఐలయ్య, తుర్కయంజాల్ డివిజన్ అధ్యక్షులు ఓర్సు శ్రీనివాస్, సీనియర్ నాయకులు కొత్త కురుమ శివకుమార్, మర్రి నిరంజన్ రెడ్డి, భూపతిగల్లా మహిపాల్, వంగేటి గోపాల్ రెడ్డి, గుండ్లపల్లి హరిత ధనరాజ్, కొంతం వెంకట్ రెడ్డి, కాకుమాను సునీల్, మేతరి దర్శన్, నక్క శివలింగం, శేఖర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# పత్తి విత్తనాలు అందజేస్తున్న డీఏవో పద్మజ

- సాంద్రత పద్ధతిలో పత్తిని సాగు చేయాలి
- ఉచితంగా పత్తి విత్తనాలు అందజేసిన డీఏవో పద్మజ

**రాజాపేట జూలై 7 (తెలంగాణ వాణి విలేకరి)**

సాంద్రత పద్ధతిలో పత్తిని సాగు చేసి అధిక దిగుబడిని పొందాలని యాదగిరిగుట్ట డి ఏ ఓ పద్మజ కోరారు. మంగళవారం రాజాపేట రైతు వేదికలో రైతులకు ఉచితంగా 300 పత్తి విత్తనాలను పంపిణీ చేసిన సందర్భంగా మాట్లాడారు. కపాస్ కాంతి మిషన్ కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వం నుంచి వచ్చిన విత్తనాల సంచులను ఎకరానికి నాలుగు చొప్పున 300 సంచులను రైతులకు అందజేశారు. ఈ సందర్భంగా డిఏఓ పద్మజ మాట్లాడుతూ అధిక సాంద్రత పద్ధతిలో పత్తి సాగు తో మొక్కల జనసాంద్రత పెరిగి,




సమర్థవంతమైన పోషక నిర్వహణ, నీటి వినియోగ సామర్థ్యం, సమగ్ర పురుగు తెగుళ్ల యాజమాన్యం, కలుపు నియంత్రణ, శాస్త్రీయ సాగు విధానాల అమలు ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చునని రైతులకు వివరించారు. వ్యవసాయ శాఖ సూచిస్తున్న సాంకేతిక సిఫార్సులను తప్పక పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆలేరు వ్యవసాయ మార్కెట్ డైరెక్టర్ సిల్వేరు బాలరాజు గౌడ్, సర్పంచుల ఫోరం అధ్యక్షులు రంగ నరేష్ గౌడ్, రాజాపేట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నమిల మహేందర్ గౌడ్, నమిల గ్రామ సర్పంచ్ పులి రాజు ముదిరాజ్, మోత్కుపల్లి ప్రవీణ్, ఎర్రగుంట సునీల్, సింగారం శ్రీశైలం, వివిధ గ్రామాల రైతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు కాంగ్రెస్ ప్రభుత్వానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్యలకు కృతజ్ఞతలు తెలిపారు.

# సైదాపూర్ కేజీబీవీని ఆకస్మికంగా సందర్శించిన అడిషనల్ కలెక్టర్

**సైదాపూర్:జులై 07 (తెలంగాణ వాణి విలేకరి)**

సైదాపూర్ లోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాల యాన్ని అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే మంగళవారం ఆకస్మికంగా సందర్శించారు.ఇక్కడ మౌలిక సదుపాయాల కోసం చేపట్టిన పలు నిర్మాణ పనులను పరిశీలించారు డార్మిటరీ, మరుగుదొడ్లు, వంటగది ఇతర నిర్మాణ పనులను తనిఖీ చేశారు. నాణ్యతతో సకాలంలో పనులు పూర్తి చేయాలని సంబంధిత శాఖ అధికారు లను ఆదేశించారు. అనంతరం తరగతిలో పాఠ్యాంశాలు వింటున్న విద్యార్థుల దగ్గరికి వెళ్లి వారితో పాటు పాఠాలు విన్నారు.ఉపాధ్యాయుల బోధన తీరును పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి బోధన తీరును సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. విద్యా పురోగతి,వసతి సౌకర్యాలు,ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తున్న ఉపాధ్యాయ బృందాన్ని అభినం దించారు.



సులభతరమైన అభ్యాస పద్ధతులను అమలు చేయాలని,తరగతి గదిలో ఉత్సా హమైన వాతావరణా న్ని సృష్టించాలని ఉపాధ్యా యులను ఆదేశించారు. పాఠశాల ప్రాంగణంలో పరిశుభ్రతా ప్రమా ణాలు, విద్యార్థుల సంక్షేమాన్ని నిరంతరం పర్యవేక్షించాలని



అధికారులను ఆదేశించారు. ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ అశోక్ కుమార్,ఎంపీడీఓ యాదగిరి, ప్లానింగ్ కోఆర్డినేటర్ మిల్కూరి శ్రీనివాస్,ఎంఈఓ కట్టా రవీంద్రాచారి,జీసీడీఓ ఉమారాణి,పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

# ఉచిత నేత్ర వైద్య శిబిరానికి అనూహ్యంగా స్పందన

**కోరుట్ల:జూలై 07(తెలంగాణ వాణి**

)మానవ సేవే మాధవ సేవ అనే మహోన్నత లక్ష్యం తో కోరుట్ల లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత నేత్ర వైద్య శిబిరానికి అనూహ్యంగా స్పందన లభించింది.ఈ శిబిరంలో 100 మందికి పైగా రోగులకు నేత్ర వైద్యులు కంటి పరీక్షలు నిర్వహించి వైద్య సలహాలు అందించారు.అనంతరం 46 మందికి కంటి శస్త్రచికిత్స అత్యవసరమని వైద్యులు నిర్ధారించారు.రూ.15,000 విలువైన కంటి శస్త్రచికిత్సను లయన్స్ క్లబ్ ఉచితంగా అందించనున్నారు.46 మంది రోగులను కరీంనగర్ లోని రేకుర్తి లయన్స్ ఆసుపత్రికి తరలించారు.శస్త్రచికిత్సతో పాటు ప్రయాణ సౌకర్యం, రెండు రోజుల వసతి,భోజనం అవసరమైన వైద్య సేవలు ఉచితంగా అందించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఆర్థిక ఇబ్బందులతో చికిత్స చేయించుకోలేకపోతున్న పేదలకు వరంగా నిలుస్తుంద ని పలువురు అభిప్రాయప డ్డారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎఫ్‌వీడీజీ లయన్ గుంటుక చంద్రప్రకాశ్ హాజరై, సమాజ ఆరోగ్య పరిరక్షణకు నిరంతరం సేవలందిస్తున్న కోరుట్ల లయన్స్ క్లబ్ సభ్యుల ప్రత్యేకంగా అభినందించారు. ఈ సేవ వెలుగు నింపేందుకు మరెందరికో స్ఫూర్తిదాయ కమని పేర్కొన్నారు.ఈ శిబిరాన్ని క్లబ్ అధ్యక్షులు లయన్ గుంటుక మహేష్, కార్యదర్శి లయన్ బెజ్జంకి శ్రీనివాస్ రావు,కోశాధికారి లయన్ పొలాస రవీందర్ నిర్వహించారు.ఈ కార్యక్ర మంలో




డాక్టర్ ప్రభాకర్, గుంటుక సురేష్ బాబు, కుందారపు మహేందర్, మంచాల జగన్,అడెపు మధు,అల్లాడి ప్రవీణ్,పోతని ప్రవీణ్,గంద్ర అజయేందర్ రావు,అన్నం అనిల్,జీవన్ రెడ్డి,ఉషాకిరణ్,గుణాకర్ రెడ్డి,లక్ష్మారెడ్డి, గంగాధర్, రఘునందన్,గంగారెడ్డి,కృష్ణ ప్రసాద్, రవీందర్ ,రాజశేఖర్, జగపతిరెడ్డి,వెంకటరాములు, రాధాకిషన్ తదితర లయన్స్ సభ్యులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా నేత్ర వైద్యులు, సిబ్బంది,సేవా కార్యక్రమానికి అన్ని విధాలుగా సహక రించి న ప్రతి ఒక్కరికీ,శిబిర సేవలను వినియోగించుకున్న ప్రజల కు లయన్స్ క్లబ్ సభ్యు లు కృతజ్ఞతలు తెలిపారు. ఒకరి జీవితంలో చూపును తిరిగి తీసుకురావడం అంటే కేవలం వైద్యం అంది ంచడం కాదు వారి కుటుంబానికి కొత్త ఆశను,కొత్త వెలుగును అందించడం.మహత్తర సేవా కార్యక్రమాలను లయన్స్ క్లబ్ భవిష్యత్తులో కూడా మరింత విస్తృతంగా కొనసాగిస్తుందని క్లబ్ ప్రతినిధులు తెలిపారు.

# ఉప్పల్‌లో 'బాలామృత' ఉత్పత్తి కేంద్రాన్ని ప్రారంభించిన సీఎం రేవంత్..

'గర్భిణులు ఆరోగ్యంగా ఉంటేనే పుట్టబోయే బిడ్డలు సుఖశాంతులతో, ఆరోగ్యంతో జన్మిస్తారు. భావితరాల ఆరోగ్యమే లక్ష్యంగా, పేద పిల్లలకు పౌష్టికాహారం అందించడమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోంది" అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. ఉప్పల్‌లో తెలంగాణ ఫుడ్స్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో 21 ఎకరాల విస్తీర్ణంలో రూపుదిద్దుకున్న అత్యాధునిక 'బాలామృత' ఉత్పత్తి కేంద్రాన్ని మంత్రి సీతక్కతో కలిసి ఆయన మంగళవారం ప్రారంభించారు.

చారిత్రక స్ఫూర్తితోనే ఈ ప్లాంట్ ఆనాడు దివంగత ప్రధాని ఇందిరా గాంధీ మహబూబ్‌నగర్‌లో శ్రీకారం చుట్టిన పోషకాహార కార్యక్రమం, నేడు అంచెలంచెలుగా ఎదిగి ఉప్పల్ నియోజకవర్గంలో భారీ పరిశ్రమగా విస్తరించడం గర్వకారణమని సీఎం అభివర్ణించారు. ఈ కేంద్రం తెలంగాణకే కాకుండా, పొరుగున ఉన్న నాలుగైదు రాష్ట్రాలకు అవసరమైన పౌష్టికాహారాన్ని సరఫరా చేసే సామర్థ్యాన్ని కలిగి ఉందని ఆయన తెలిపారు.

**2034 నాటికి కోటి మంది కోటీశ్వరులు..**

మహిళలను కేవలం ఇంటికే పరిమితం చేయకుండా, పరిపాలనలో, వ్యాపారాల్లో రాణించేలా తీర్చిదిద్దుతున్నామని సీఎం చెప్పారు. "2034 నాటికి కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే నా లక్ష్యం" అని ఆయన ప్రకటించారు. ఆర్టీసీలో ఉచిత బస్సు ప్రయాణం ద్వారా మహిళలకు నెలకు రూ.10,000 ఆదా




అవుతోందని, ఇందుకోసం ప్రభుత్వం 30 నెలల్లోనే రూ.11,000 కోట్లు ఆర్టీసీకి చెల్లించిందని వివరించారు. మహిళలకు పెట్రోల్ బంకులు, క్యాంటీన్లు, ఇందిరా మహిళా శక్తి నైట్ బజార్ వంటి అవకాశాలు కల్పిస్తున్నామని తెలిపారు.

**విద్యార్థులకు నాణ్యమైన విద్య, భోజనం..**

ప్రభుత్వ పాఠశాలల్లో పేద పిల్లలు ఆకలితో చదువును కోల్పోకూడదని నర్సరీ నుంచి 12వ తరగతి వరకు బ్రేక్‌ఫాస్ట్, మధ్యాహ్న భోజనం అందిస్తున్నామని సీఎం పేర్కొన్నారు. వంట నాణ్యతను పెంచేందుకు, ఉపాధ్యాయులు కూడా పిల్లలతో కలిసే భోజనం చేయాలని చట్టం చేశామని ఆయన చెప్పారు. దీనికోసం ప్రభుత్వం ప్రతి ఏడాది రూ. 27,000 కోట్లు విద్యార్థుల కోసం వెచ్చిస్తోందని స్పష్టం చేశారు.

**రాజకీయాలకు అతీతంగా ఉప్పల్ అభివృద్ధి..**

గతంలో పార్లమెంట్ సభ్యుడిగా ఉప్పల్ నియోజకవర్గ అభివృద్ధికి ఆశించిన స్థాయిలో నిధులు తీసుకురాలేకపోయానని, కానీ ఇప్పుడు ముఖ్యమంత్రిగా ఆ లోటును తీరుస్తానని సీఎం హామీ ఇచ్చారు. స్థానిక ప్రజాప్రతినిధుల సూచన మేరకు, రాజకీయాలకు అతీతంగా నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తామని ఆయన భరోసా ఇచ్చారు.

**దేశంలోనే అరుదైన ప్లాంట్: మంత్రి సీతక్క**

ముఖ్యమంత్రి ప్రసంగానికి ముందు మంత్రి సీతక్క మాట్లాడుతూ.. సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు చిన్నారులు, గర్భిణుల కోసం పౌష్టికాహారాన్ని అత్యంత నాణ్యంగా తయారు చేస్తున్నామని తెలిపారు. గతం నాటి కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన భూముల్లోనే ఈరోజు చిన్నారుల ఆరోగ్యం కోసం ఇంతటి భారీ అసెట్స్ సృష్టించడం ఆనందంగా ఉందన్నారు. ఇలాంటి అత్యాధునిక ప్లాంట్లు దేశంలోనే అరుదని, దీని ద్వారా లక్షలాది మందికి పౌష్టికాహారం అందుతుందని మంత్రి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీలు అద్దంకి దయాకర్,బల్మూర్ వెంకట్,ఉప్పల్ శాసనసభ్యులు బండారి లక్ష్మారెడ్డి, తెలంగాణ ఫుడ్స్ కార్పొరేషన్ చైర్మన్ ఎం.ఎఫ్. ఫహీం, కలెక్టర్ మిక్కిలినేని మనుచౌదరి, డీసీసీ అధ్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్, ఉప్పల్ కాంగ్రెస్ పార్టీ ఇన్ చార్జీ పరమేశ్వర్ రెడ్డి ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

# కలెక్టరేట్ వద్ద ఉద్రిక్తత.. భూములను తిరిగి ఇవ్వాలని రైతుల ధర్నా

ఆసిఫాబాద్ : అటవీ భూముల పేరుతో ఫారెస్ట్ అధికారులు స్వాధీనం చేసుకున్న రైతుల సాగు భూములను తిరిగి అప్పగించాలని డిమాండ్ చేస్తూ సుర్దాపూర్ గ్రామ రైతులు మంగళవారం జిల్లా కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాకు ఎమ్మెల్యే కోవలక్ష్మి మద్దతు తెలుపుతూ రైతులతో కలిసి ధర్నాలో పాల్గొన్నారు. అనంతరం రైతులతో కలిసి కలెక్టరేట్‌లోకి వెళ్లేందుకు ఎమ్మెల్యే ప్రయత్నించగా, పోలీసులు వారిని అడ్డుకున్నారు. దీంతో కొంతసేపు కలెక్టరేట్ వద్ద ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోవలక్ష్మి మాట్లాడుతూ రైతులు దశాబ్దాలుగా సాగుచేస్తున్న భూములను అటవీ భూముల పేరుతో ఫారెస్ట్ అధికారులు స్వాధీనం చేసుకోవడం తీవ్ర అన్యాయమని మండిపడ్డారు. గత 40 నుంచి 50 సంవత్సరాలుగా రైతులు ఈ భూములను సాగు చేసుకుంటున్నారని, ఇన్నేళ్లు గుర్తుకు



రాని అటవీ భూములు ఖరీఫ్ సీజన్ ప్రారంభమైన సమయంలోనే అధికారులకు ఎలా గుర్తుకు వస్తాయని ప్రశ్నించారు.

ఎండాకాలంలో అధికారులు ఏం చేశారని నిలదీశారు. ఫారెస్ట్ అధికారుల పనితీరు పై ఆమె తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ఆసిఫాబాద్ నియోజకవర్గంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎన్నడూ లేనివిధంగా పోడు రైతులను తీవ్ర వేధింపులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. రైతుల సమస్యలను డీఎఫ్‌వో, పీసీసీఎఫ్ దృష్టికి తీసుకెళ్లినా స్పందించడం లేదని విమర్శించారు. ప్రస్తుతం రైతులు ఇప్పటికే పొలాల్లో విత్తనాలు వేసినందున, ఈ ఏడాది పంట సాగు చేసుకునేందుకు అవకాశం కల్పించాలని ఆమె ప్రభుత్వాన్ని కోరారు. వచ్చే ఏడాది భూ సమస్యల శాశ్వత పరిష్కారం కోసం రెవెన్యూ, ఫారెస్ట్ శాఖల సంయుక్త సర్వే నిర్వహించాలని సూచించారు. ఈ విషయం పై రాష్ట్రప్రభుత్వం వెంటనే స్పందించాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎమ్మెల్యే కోవలక్ష్మి రైతులతో కలిసి డీఎఫ్‌వో కార్యాలయాన్ని ముట్టడించారు. రైతులకు అన్యాయం చేస్తే ఊరుకునేది లేదని ఆమె హెచ్చరించారు.

## వ్యాధుల నివారణకు ముందస్తు చర్యలు చేపట్టాలి: డీఎంహెచ్‌వో



**మంచిర్యాల, జులై 07 (తెలంగాణ వాణి):**
జిల్లాలో వర్షాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ నరేందర్ రాథోడ్ వైద్య సిబ్బందికి సూచించారు. మంగళవారం లక్షెట్టిపేట రైతు వేదికలో జన్నారం, దండేపల్లి, తాళ్లపేట్, వెంకట్రావుపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలోని వైద్యులు, సిబ్బంది, ఆశా, ఆరోగ్య కార్యకర్తలతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు.ప్రతి ఆశా, ఆరోగ్య కార్యకర్త వద్ద అవసరమైన మందులు అందుబాటులో ఉండేలా చూడాలని, మలేరియా, డెంగ్యూ, చికున్‌గున్యా, ఫైలేరియా వంటి కీటక జనిత వ్యాధులు వ్యాప్తి చెందకుండా పరిసరాల పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. గ్రామపంచాయతీలు, మున్సిపాలిటీలు, ప్రజాప్రతినిధులతో సమన్వయం చేసుకుని దోమల నివారణ చర్యలు చేపట్టాలని, కలుషిత నీటి వల్ల వచ్చే టైఫాయిడ్, అతిసారం వంటి వ్యాధుల నివారణకు ప్రజల్లో అవగాహన కల్పించాలని అన్నారు.గర్భిణులకు ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే ప్రసవాలు జరిగేలా ప్రోత్సహించాలని, లక్షెట్టిపేట ప్రభుత్వ ఆసుపత్రిలో అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. గర్భిణులను ప్రైవేట్ ఆసుపత్రులకు తీసుకెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, అవసరమైన పరీక్షలు, స్కానింగ్‌లు, 102 అంబులెన్స్ సేవలను వినియోగించుకోవాలని సూచించారు.వ్యాధుల ప్రబలే అవకాశమున్న ప్రాంతాలు, పాఠశాలలు, హాస్టళ్లలో వైద్య శిబిరాలు నిర్వహించాలని, క్షయవ్యాధి నియంత్రణలో భాగంగా గ్రామాల్లో తెమడ పరీక్షలు, పోర్టబుల్ ఎక్స్‌రే సేవలు నిర్వహించి బాధితులను గుర్తించి చికిత్స అందించాలని ఆదేశించారు. అన్ని శాఖలతో సమన్వయం చేసుకుంటూ ప్రజలకు మెరుగైన ఆరోగ్య సేవలు అందించాలని వైద్య సిబ్బందికి సూచించారు.ఈ సమావేశంలో ఉప జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు, ప్రోగ్రామ్ అధికారులు, వైద్యులు, ఆశా కార్యకర్తలు, ఆరోగ్య సిబ్బంది, సూపర్వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

## చోరీ సొత్తు కొనుగోలు, రవాణా చేస్తున్న ముఠా అరెస్ట్

### మావలా ఇన్స్పెక్టర్ బి డి ప్రేమ్ కుమార్



**ఆదిలాబాద్, జులై : 07 ( తెలంగాణ వాణి ప్రతినిధి )**
మావల పోలీస్ స్టేషన్ పరిధిలో చోరీ సొత్తును కొనుగోలు చేసి అక్రమంగా రవాణా చేస్తున్న ముఠాను అరెస్ట్ చేసి, రూ.3.55 లక్షల విలువైన 296 కిలోల రాగి తీగలు, ఒక బొలెరో మ్యాక్స్ పికప్ వాహనం, 5 మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు మావల ఎస్‌హెచ్‌ఓ బి.డి. ప్రేమ్ కుమార్ తెలిపారు. ఆదివారం విశ్వసనీయ సమాచారం మేరకు మావల పోలీసులు దాస్నాపూర్ గ్రామంలోని పిట్టలవాడ ప్రాంతంలో వాహన తనిఖీలు నిర్వహించారు. సాయంత్రం ఒక బొలెరో మ్యాక్స్ పికప్ వాహనాన్ని అనుమానాస్పదంగా గుర్తించి తనిఖీ చేయగా, ఇనుప స్క్రాప్‌తో పాటు 17 సంచుల్లో 296 కిలోల రాగి తీగలు లభ్యమయ్యాయి. వాటి మార్కెట్ విలువ సుమారు రూ.3.55 లక్షలుగా గుర్తించారు. విచారణలో ప్రధాన నిందితుడు షేక్ అయ్యూబ్ చోరీకి గురైన రాగి తీగలను తెలిసి కూడా కొనుగోలు చేసి నిజామాబాద్‌కు తరలించి విక్రయిస్తున్నట్లు అంగీకరించాడు. అతనికి షేక్ అమర్ సహకరిస్తున్నట్లు వెల్లడించాడు. అలాగే దాస్నాపూర్‌కు చెందిన స్క్రాప్ వ్యాపారులు మొహమ్మద్ అబ్దుల్ మతీన్ అలియాస్ సౌఫిక్, మొహమ్మద్ ఇమ్రాన్ ఉద్దీన్, పంజేషా మహల్లాకు చెందిన మొహమ్మద్ జావేద్, మొహమ్మద్ ఫైజ్ ఉద్దీన్ చోరీ సొత్తుగా అనుమానిస్తున్న రాగి తీగలను విక్రయించినట్లు విచారణలో తేలింది. నిందితుల వద్ద నుంచి ఒక బొలెరో మ్యాక్స్ పికప్ వాహనం, 17 సంచుల్లో 296 కిలోల రాగి తీగలు, 5 మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకుని, సంబంధిత చట్టాల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు మావల ఎస్‌హెచ్‌ఓ బి.డి. ప్రేమ్ కుమార్ తెలిపారు.

## ఘనంగా మందకృష్ణ జన్మదిన వేడుకలు

### -ఎమ్మార్పీఎస్ జెండా ఆవిష్కరణ..పండ్ల పంపిణీ



**రామకృష్ణాపూర్, జూలై 07 (తెలంగాణ వాణి)**
క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలోని రామకృష్ణాపూర్ సూపర్ బజార్ ప్రాంతంలో ఎమ్మార్పీఎస్ 32వ జెండా ఆవిష్కరణతో పాటు పద్మశ్రీ మందకృష్ణ మాదిగ జన్మదిన వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఎమ్మార్పీఎస్ పట్టణ అధ్యక్షుడు రాచర్ల సరేష్ మాదిగ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో మందకృష్ణ మాదిగ చిత్రపటానికి పాలాభిషేకం చేసి, కేక్ కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.అనంతరం స్థానిక బాలికల ఉన్నత పాఠశాలలోని విద్యార్థినులకు పరీక్షా ప్యాడ్లు, పండ్లు పంపిణీ చేశారు. విద్యార్థులు విద్యలో రాణించి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని నాయకులు ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు పుల్లూరు కళ్యాణ్, ఆర్మూల పోశం, కాదాసి సంపత్, కన్నూరి రాజేందర్, ఆవునూరి గట్టయ్య, రామిల్ల మల్లేష్, దాసరపు ఆగయ్య, మారపల్లి రాజయ్య, ఎల్లసాని శ్రీనివాస్, సలిగముల రమేష్, ఎంఎస్ఎఫ్ నాయకులు మారపల్లి సాయికుమార్, రేణిగుంట్ల అఖిల్, కవంపల్లి ప్రవీణ్, కలువల శ్రీనివాస్, కిరణ్, డప్పు కళాకారులు తదితరులు పాల్గొన్నారు.

# మారుమూల ప్రాంతాల ప్రజలకు 24 గంటల వైద్యసేవలు అందుబాటులో ఉండాలి

- వన మహోత్సవంలో విరివిగా మొక్కలు నాటాలి
- ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పించాలి
- ఎంబి మండలంలో ఆకస్మిక తనిఖీల్లో

**జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా ఆదేశాలు**



**నిర్మల్, జూలై 07(తెలంగాణ వాణి ప్రతినిధి)**
మారుమూల ప్రాంతాల ప్రజలకు ప్రభుత్వ ఆసుపత్రుల్లో 24 గంటల పాటు నాణ్యమైన వైద్యసేవలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. మంగళవారం పెంబి మండలంలో ఆకస్మికంగా పర్యటించిన ఆయన ఆరోగ్య కేంద్రం, పాఠశాల, కేజీబీవీ, గ్రామపంచాయతీ కార్యాలయాలను తనిఖీ చేసి పలు సూచనలు చేశారు.ముందుగా మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించిన కలెక్టర్, ఓపీ విభాగం, మందుల నిల్వ గది, ఇతర విభాగాలను పరిశీలించారు. అవసరమైన మందులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంచాలని, రోజువారీ ఓపీ నమోదు, వైద్యులు, సిబ్బంది హాజరు వివరాలను పరిశీలించి అన్ని రికార్డులను పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు. వర్షాకాలంలో కాలానుగుణ వ్యాధులు, పాముకాటు కేసులు పెరిగే అవకాశమున్నందున వైద్యులు అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. ఆసుపత్రికి వచ్చే రోగులకు తాగునీరు, కూర్చునే సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. మండలంలోని ఆరోగ్య ఉపకేంద్రాల పనితీరుపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలను సందర్శించిన కలెక్టర్, వన మహోత్సవంలో భాగంగా మొక్క నాటి, వాటి సంరక్షణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. పదో తరగతి విద్యార్థులతో ముచ్చటిస్తూ చదువులో ప్రతిభ కనబర్చాలని, ప్రతిరోజూ తప్పనిసరిగా పాఠశాలకు హాజరుకావాలని సూచించారు. బడికి రాని విద్యార్థులను గుర్తించి తిరిగి పాఠశాలకు వచ్చేలా చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. మందపల్లి గ్రామపంచాయతీ కార్యాలయంలో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను పరిశీలించిన కలెక్టర్, ఎన్యుమరేషన్ ఫారాల ఆన్‌లైన్ నమోదు వేగవంతం చేసి గడువులోగా పూర్తి చేయాలని సూచించారు. అలాగే గ్రామంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ)ను తనిఖీ చేసి విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు వివరాలను తెలుసుకున్నారు. విద్యార్థులకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. పదో తరగతి విద్యార్థులతో మాట్లాడి పాఠ్యాంశాలపై ప్రశ్నలు అడిగారు. సరైన సమాధానాలు చెప్పిన విద్యార్థులను అభినందించి, క్రమశిక్షణతో చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలని ప్రోత్సహించారు. పర్యటనలో జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి రాజేందర్, జిల్లా విద్యాశాఖ అధికారి భోజన్న, తహసీల్దార్ లక్ష్మణ్, ఎంఈఓ రామ్‌చందర్, ఎఫ్ఆర్ఓ కల్పనాదేవి, సంబంధిత శాఖల అధికారులు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

## పద్మ వంశీ చేనేత సహకార సంఘం చైర్మన్ గా ఏకగ్రీవంగా ఎన్నికైన శెట్టి ఉప్పలయ్య



**యాదగిరిగుట్ట జూలై: 07(తెలంగాణ వాణి విలేకరి)**
యాదగిరిగుట్ట మండలం గౌరయపల్లి గ్రామ పద్మ వంశీ చేనేత సహకారం పరపతి సంఘం ఎన్నికల్లో అధ్యక్షుడిగా శెట్టి ఉప్పలయ్య ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి శైలజ ప్రకటించారు. ఉపాధ్యక్షుడిగా ఎలగన్దుల భాస్కర్, ప్రధాన కార్యదర్శిగా భోగ ఉదయ్ కుమార్, డైరెక్టర్లు గా యేన గందుల ఉమా ఋషి, ఉద్యమశ్రి నగేష్, సామల సిద్ధులు, వెంగాల్ దాస్ నర్సింలు, కుందారపు అరుణ, చెరుపల్లి లావణ్య, ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు, ఈ సందర్భంగా అధ్యక్షుడిగా ఎన్నికైన శెట్టి ఉప్పలయ్య మాట్లాడుతూ సంఘ అభివృద్ధికి ఎల్లవేళలా సహకారం అందిస్తానని, చేనేత కార్మికులకు ప్రభుత్వం నుంచి రావలసిన అన్ని పథకాలను, ప్రయోజనాలను కార్మికులకు అందేలా కృషి చేస్తానని, సబ్సిడీ పథకాలు, బ్యాంకు సౌకర్యం, ప్రతి కార్మికునికి అందేలా కృషి చేస్తానని తెలియజేశారు, తనమీద నమ్మకం ఉంచి తనను ఎనుకున్న డైరెక్టర్లకు, సంఘ సభ్యులకు కృతజ్ఞతలు తెలియజేశారు.

## సమగ్ర సవరణ దరఖాస్తులను తప్పులు లేకుండా నింపాలన్న మెదక్ జిల్లా కలెక్టర్



**మెదక్, జూలై 07:(తెలంగాణ వాణి ప్రతినిధి)**
మెదక్ జిల్లాలో భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు చేపట్టిన ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ కార్యక్రమం పురోగతిపై మంగళవారం రోజునజిల్లా అధికారుల ఆధ్వర్యంలో మీడియా సమావేశం నిర్వహించబడింది. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ, జిల్లాలోని 34-మెదక్ , 37-నర్సాపూర్ అసెంబ్లీ నియోజకవర్గాలలో మొత్తం 586 మంది బూత్ లెవల్ అధికారులు నియమించబడగా, వారందరికీ శిక్షణ పూర్తయిందని తెలిపారు. జిల్లాలోని మొత్తం 4,53,140 మంది ఓటర్లకు సంబంధించిన ఎన్యూమరేషన్ ఫారమ్‌లు పూర్తిగా డౌన్‌లోడ్ చేసి పంపిణీ ప్రక్రియ చేపట్టినట్లు వెల్లడించారు. ఇప్పటివరకు 4,38,409 ఫారమ్‌లు (96.75 శాతం) పంపిణీ చేయగా, 45,663 ఫారమ్‌లు (10.08 శాతం) డిజిటలైజ్ చేయబడ్డాయని తెలిపారు. ఇప్పటివరకు 21,092 మంది ఓటర్లు స్వయంగ వివరాలను నమోదు చేసుకోగా, 23,217 మంది ప్రెగ్నెన్సీ మ్యాపింగ్ ద్వారా వివరాలను సమర్పించారు. కేవలం 580 కేసుల్లో మాత్రమే మ్యాపింగ్ పెండింగ్లో ఉందని అధికారులు తెలిపారు. అధికారులు ప్రజలకు విజ్ఞప్తి చేస్తూ, ఇంకా ఎన్యూమరేషన్ ఫారమ్‌లు సమర్పించని అర్హులైన ఓటర్లు వెంటనే తమ పరిధిలోని బూత్ లెవెల్ అధికారులను సంప్రదించి ఫారమ్‌లు పూర్తి చేసి అందజేయాలని కోరారు. సరైన వివరాలతో ఫారమ్‌లు సమర్పించడం ద్వారా ఓటరు జాబితా మరింత పారదర్శకంగా, ఖచ్చితంగా రూపొందుతుందని పేర్కొన్నారు. జిల్లా యంత్రాంగం ప్రత్యేక కార్యాచరణతో ప్రతి ఇంటిని సందర్శిస్తూ ఓటర్లకు అవసరమైన సహాయం అందిస్తోందని, ప్రజలందరూ ఈ కార్యక్రమానికి సహకరించి తమ ఓటు హక్కును పరిరక్షించు కోవాలని ఆమె విజ్ఞప్తి చేశారు ఈ కార్యక్రమంలో డి పి ఆర్ ఓ రామచంద్ర రాజు, ఎలక్షన్ సూపరిండెంట్ గఫార్,సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## టీయూడబ్ల్యూజే జిల్లా మహాసభ పోస్టర్ ఆవిష్కరణ



**పటాన్‌చెరు, జూలై 7 (తెలంగాణ వాణి):**
తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (టీయూడబ్ల్యూజే) సంగారెడ్డి జిల్లా మహాసభ పోస్టర్‌ను మంగళవారం పటాన్‌చెరులో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా అధ్యక్షుడు రుమాండ్ల అనిల్ కుమార్ మాట్లాడుతూ, ఈ నెల 9న సంగారెడ్డి టీఎన్‌జీవో భవన్‌లో జరిగే జిల్లా మహాసభకు జర్నలిస్టులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. జర్నలిస్టుల హక్కుల పరిరక్షణ, సంక్షేమమే సంఘం ప్రధాన లక్ష్యమని, జిల్లా మహాసభలో కొత్త కమిటీలను నియమించడంతో పాటు కీలక తీర్మానాలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టులు నర్రా రామారావు, సయ్యద్ సులేమాన్, కాశీపతి, పత్తి నరసింహ, ఏబీఎన్ యాదగిరి, బసవేశ్వర్, బాలు, శ్రీనివాసరెడ్డి, బీసీఎన్ శ్రీనివాస్, మాజీద్ అలీ, మడపటి శేఖర్, వివేక్, కోటేష్, శివాజీ, ప్రభాకర్ యాదవ్, సిద్దు, రాము, సంజీవ, రాజు, సలీం, విజయ్ కుమార్, బండి పురుషోత్తం, శంకర్, రాము,దశరత్, సంతోష్, రాజు, రాము తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రోడ్డు భద్రతపై అవగాహన

**ఆటో రిక్షాలో ప్రయాణం, మారకద్రవ్యాల నివారణ పై అవగాహన**



**నాగిరెడ్డిపేట మండలం జూలై 7:( తెలంగాణ వాణి ప్రతినిధి)**
నాగిరెడ్డిపేట మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం రోజున అవగాహన కార్యక్రమాన్ని జిల్లా రవాణా అధికారి సంతోష్ కుమార్ ఆదేశాల మేరకు జిల్లా కలెక్టర్ ఆషీష్ సంగ్వాన్ ఆదేశాల మేరకు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. సమాజంలో అనేక సంఘటనలకు మాదకద్రవ్యాలకు ముడిపడి ఉంది కాబట్టి మాదకద్రవ్యాల నివారణ పై విస్తృత అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు . పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకటరామిరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించినటువంటి ఈ సమావేశంలో రవాణా శాఖ అధికారులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు . సహాయకం మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ ఉదయ్ కుమార్ మహమ్మద్ రఫీ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు . ఈ సందర్భంగా ఉదయ్ కుమార్ మాట్లాడుతూ నిర్లక్ష్యం కారణంగా, అవగాహన రహితంగా జరిగే ప్రమాదాలను నివారించేందుకు ట్రాఫిక్ నిబంధనలను పూర్తిగా అవగాహన చేసుకోవాలి . 18 సంవత్సరాలు నిండిన తర్వాతనే వాహనాలు నడపాలని , 18 సంవత్సరాల లోపు ఉన్నవాళ్లు వాహనాలు నడపవద్దని , ట్రిపుల్ రైటింగ్ ఇలాంటివి మానుకుంటే బాగుంటుందని హెచ్చరించారు . ఇంట్లో కుటుంబ సభ్యులతో చర్చించి రోడ్డు భద్రత నియమాలపై అవగాహన కల్పించి రోడ్డు ప్రమాదాలపై అవగాహన పెంచి రహదారి భద్రతలో భాగస్వాములు కావాలని కోరారు . అలాగే ప్రతి మాట్లాడుతూ ఆటో రిక్షాల్లో పరిమితికి మించి ప్రయాణం చేయరాదు పిల్లలు వారి తల్లిదండ్రులు ఇది తూచా తప్పకుండా గమనించాలి అని సూచించారు . ఇట్టి కార్యక్రమంలో భాగంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు, అధికారులు తెలిపిన సూచనలను సలహాలను పాటించి బంగారు భవిష్యత్తుకు తోడుంటామని పిలిపించారు.



## రోడ్డు పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలి:

### జిల్లా కలెక్టర్ రాజర్షి షా

**ఆదిలాబాద్, జులై : 07 ( తెలంగాణ వాణి ప్రతినిధి )**
ప్రజలకు సురక్షితమైన, సౌకర్యవంతమైన రవాణా అందించడమే లక్ష్యంగా రోడ్డు నిర్మాణ పనులను వేగవంతం చేసి, నాణ్యత ప్రమాణాలతో నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అధికారులను ఆదేశించారు. ఈదులసావర్గామ్ నుంచి నిపాని మీదుగా అర్లీ(టీ) వరకు రూ.18 కోట్ల వ్యయంతో చేపడుతున్న రోడ్డు అభివృద్ధి పనులను జిల్లా కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పనుల పురోగతిపై సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఇప్పటివరకు రూ.5 కోట్లతో చేపట్టిన పనులు పూర్తయ్యాయని, ప్రస్తుతం రూ.3 కోట్ల వ్యయంతో సుమారు మూడు కిలోమీటర్ల మేర దెబ్బతిన్న రహదారిని పునర్నిర్మిస్తున్న పనులను ఆయన పరిశీలించారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని పనులను మరింత వేగవంతం చేయాలని, ఎక్కడా నాణ్యతలో రాజీ పడకుండా ఇంజినీరింగ్ ప్రమాణాలను కచ్చితంగా పాటించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. రహదారి పనుల కారణంగా ప్రయాణికులకు అసౌకర్యం కలగకుండా అవసరమైన భద్రతా చర్యలు చేపట్టాలని, హెచ్చరిక బోర్డులు, ట్రాఫిక్ మళ్లింపు ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. ప్రజల రాకపోకలకు ఇబ్బందులు తలెత్తకుండా యుద్ధ ప్రాతిపదికన పనులను పూర్తి చేసి, త్వరితగతిన రహదారిని అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత శాఖ అధికారులు, కాంట్రాక్టర్‌ను కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో రోడ్లు, భవనాల శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నర్సయ్య, కాంట్రాక్టర్ నవీన్, సుమన్, ఇంజినీరింగ్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## రిమ్స్ డి-అడిక్షన్ సెంటర్‌ను పరిశీలించిన ఎస్పీ అఖిల్ మహాజన్



**ఆదిలాబాద్, జూలై 7 (తెలంగాణ వాణి ప్రతినిధి)**
: గంజాయి, ఇతర మత్తు పదార్థాల నిర్మూలనకు జిల్లా పోలీసు శాఖ ప్రత్యేక కార్యాచరణ చేపట్టిందని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. స్థానిక రిమ్స్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో ఏర్పాటు చేయనున్న డి-అడిక్షన్ సెంటర్‌ను ఆయన మంగళవారం పరిశీలించి, వైద్య సదుపాయాలు, కౌన్సెలింగ్, పునరావాస సేవలపై వైద్య బృందంతో సమీక్ష నిర్వహించారు. గంజాయి సరఫరా, విక్రయాలపై కఠిన చర్యలు కొనసాగుతాయని, వ్యసనగ్రస్తులకు వైద్య చికిత్స, మానసిక కౌన్సెలింగ్ అందించి సాధారణ జీవితంలోకి తీసుకురావడమే లక్ష్యమని ఎస్పీ పేర్కొన్నారు. ప్రజల సహకారంతో గంజాయి రహిత ఆదిలాబాద్ జిల్లాను నిర్మిద్దామని పిలుపునిచ్చారు.

## వరుసగా ఏడో రోజు 'రైతు భరోసా'..

రాష్ట్రంలోని అన్నదాతలకు పెట్టుబడి సాయం అందించే రైతు భరోసా పథకం పంపిణీ ప్రక్రియ ముమ్మరంగా సాగుతోంది. ఇందులో భాగంగా ఏడో రోజు 8 ఎకరాల లోపు భూమి ఉన్న రైతులకు నిధులు విడుదల చేసినట్లు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు తెలిపారు. ఇవాళ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 58,831 మంది రైతుల బ్యాంక్ ఖాతాల్లో నేరుగా రూ.259.73 కోట్లను ప్రభుత్వం జమ చేస్తోందని మంత్రి వివరించారు. అయితే, గడిచిన 7 రోజుల్లో 'రైతు భరోసా' కింద ప్రభుత్వం మొత్తం రూ.7,750.45 కోట్లను రైతుల ఖాతాల్లోకి బదిలీ చేసిందని వెల్లడించారు. ఈ నిధుల ద్వారా తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటి వరకు 68.96 లక్షల మంది అన్నదాతలకు పెట్టుబడి సాయం చేరిందని, మిగిలిన వారికి కూడా విడతల వారీగా రైతు భరోసా నిధులు జమ అవుతాయని మంత్రి తుమ్మల నాగేశ్వర రావు స్పష్టం చేశారు.

## సిసి రోడ్డు పనులను ప్రారంభించిన గోపాల్పేట్ సర్పంచ్



**నాగిరెడ్డిపేట మండలం జులై 7:( తెలంగాణ వాణి ప్రతినిధి)**
నాగిరెడ్డిపేట మండలంలోని గోపాల్పేట గ్రామంలో మంగళవారం రోజున నూతనంగా సిసి రోడ్ పనులను గ్రామ సర్పంచ్ ,ఉప సర్పంచ్ ప్రారంభించారు. 10 లక్షల వ్యయంతో కూడిన సిసి రోడ్ల నిర్మాణం టెంకాయను కొట్టి ప్రారంభించారు . రోడ్ల నిర్మాణానికి స్థానిక ఎమ్మెల్యే మదన్మోహన్రావు మంజూరు చేసిన నిధులతో సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు అలాగే స్థానిక ఎమ్మెల్యే మదన్మోహన్రావు కు గ్రామ సర్పంచ్ వంశీకృష్ణ గౌడ్ , ఉప సర్పంచ్ గులాబ్ హుస్సేన్ హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. పోచమ్మ దేవాలయం వెనుక కాలనీలో సిసి రోడ్ నిర్మాణ పనులను మంగళవారం రోజు పూర్తి చేశారు.

## నర్రేగూడ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత




**పటాన్‌చెరు/అమీన్‌పూర్ (తెలంగాణ వాణి)**
: అమీన్‌పూర్ మండలం నర్రేగూడ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో తీవ్ర ఉపాధ్యాయుల కొరత నెలకొంది. పాఠశాలలో 1 నుంచి 5వ తరగతి వరకు 95 మంది, పూర్వ ప్రాథమికంలో 17 మంది విద్యార్థులు ఉండగా, మొత్తం వందకు పైగా విద్యార్థులకు ప్రస్తుతం ఇద్దరు ఉపాధ్యాయులే బోధిస్తున్నారు. దీంతో ఒకే ఉపాధ్యాయుడు ఒకేసారి రెండు, మూడు తరగతులకు బోధించాల్సి వస్తోందని, విద్యా ప్రమాణాలు దెబ్బతింటున్నాయని తల్లిదండ్రులు, గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని వర్క్ అడ్జస్ట్‌మెంట్ ద్వారా కనీసం ఇద్దరు అదనపు ఉపాధ్యాయులను వెంటనే నియమించాలని విద్యాశాఖ అధికారులను గ్రామస్థులు కోరుతున్నారు.

## అణు నిర్మాణాల గణిత నమూనాపై పరిశోధనకు పీహెచ్.డీ.

**పటాన్ చెరు, జూలై 7, (తెలంగాణ వాణి రిపోర్టర్):**



హైదరాబాదు లోని గీతం స్కూల్ ఆఫ్ సైన్స్, గణిత, గణాంక శాస్త్ర విభాగం పరిశోధక విద్యార్థిని జైనా ప్రణవి డాక్టరేట్ కు అర్హత సాధించారు. 'టోపోలాజికల్ సూచికలను ఉపయోగించి అణు నిర్మాణాల గణిత నమూనా రూపకల్పన. చేశారు. గ్రాఫ్ సైద్ధాంతిక విధానం'పై ఆమె పూర్తి స్థాయి పరిశోధక విద్యార్థిగా అధ్యయనం చేసి, సిద్ధాంత వ్యాసాన్ని సమర్పించారు. ఈ పరిశోధనకు మార్గదర్శనం వహిస్తున్న గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ గణిత శాస్త్ర విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ జె. విజయశేఖర్ మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో ఈ విషయాన్ని వెల్లడించారు. ఈ డాక్టరల్ పరిశోధన, గణనపరంగా అధిక శ్రమతో కూడిన క్వాంటం-రసాయన పద్ధతులపై ఆధారపడకుండా, అణు నిర్మాణాలకు నమూనా రూపొందించడానికి, వాటి భౌతిక, రసాయన ధర్మాలను కచ్చితంగా అంచనా వేయడానికి గ్రాఫ్ సిద్ధాంతం యొక్క అనువర్తనాన్ని అన్వేషిస్తుందని వివరించారు. ఈ పరిశోధన, అలిఫాటిక్ కీటోన్లు, కొవ్వు ఆమ్లాలు, క్యాన్సర్ నిరోధక సమ్మేళనాలతో సహా వివిధ రకాల అణువులను విశ్లేషించడానికి టోపోలాజికల్ సూచికల ఆధారంగా గణిత నమూనాలను అభివృద్ధి చేసిందన్నారు. ఈ నమూనాలు బాష్పీభవన స్థానం, ద్రవీభవన స్థానం, మోలార్ ఘనపరిమాణం, ఎంథాల్పీ, పోలరైజేషన్ వంటి కీలక అణు ధర్మాలను అధిక కచ్చితత్వంతో విజయవంతంగా అంచనా వేసినట్టు తెలిపారు. ఈ అధ్యయనం గ్రాఫ్ సిద్ధాంతాన్ని మాలిక్యులర్ మోడలింగ్ కోసం ఒక సరళమైన, నమ్మదగిన, గణనపరంగా సమర్థవంతమైన విధానంగా రుజువు చేస్తుందన్నారు. ఇది కంప్యూటేషనల్ కెమిస్ట్రీ, ఫార్మాస్యూటికల్ పరిశోధన, మెటీరియల్స్ సైన్స్, ఔషధ ఆవిష్కరణలో ముఖ్యమైన అనువర్తనాలను అందిస్తుందని తెలిపారు. ఇది గ్రాఫ్ సిద్ధాంతం, మాలిక్యులర్ సైన్స్ మధ్య సంబంధాన్ని బలోపేతం చేయడం ద్వారా అభివృద్ధి చెందుతున్న గణిత రసాయన శాస్త్ర రంగాన్ని కూడా బలపరుస్తుందన్నారు. అదే సమయంలో, కృత్రిమ మేధస్సు (ఏఐ), మెషిన్ లెర్నింగ్ ను ఏకీకృతం చేసే భవిష్యత్తు పరిశోధనలకు బలమైన పునాదిని అందిస్తుందని వివరించారు. డాక్టర్ ప్రణవి సిద్ధాంత వ్యాసం పీహెచ్.డీ. పట్టాకు అర్హత సాధించడం పట్ల గీతం హైదరాబాదు అదనపు ఉపకులపతి ప్రొఫెసర్ డీ.ఎస్.రావు, గీతం రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ, స్కూల్ ఆఫ్ సైన్స్ డైరెక్టర్ డాక్టర్ ఎం.రెజా, గణిత, గణాంక శాస్త్ర విభాగాధిపతి డాక్టర జాదవ్ గణేష్, పలు విభాగాల అధిపతులు, అధ్యాపకులు, సిబ్బంది తదితరులు అభినందించినట్టు ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## చింతలూరు గ్రామంలో ఘనంగా శీతల భవాని పండగ



**రాయికల్: జూలై 07(తెలంగాణ వాణి):**
రాయికల్ మండలము చింతలూరు గ్రామంలో బంజారా గిరిజనులు సాంప్రదాయ పండగ అయిన శీతల భవాని మాతను ఘనంగా పూజించారు. ఈ సందర్భంగా గిరిజనులు ప్రతియేట పెద్దపూస మొదటి మంగళవారం రోజున ఈ పండుగను జరుపుకుంటారు. వర్షాలు బాగా కురిసి పంటలు బాగా పండాలని పశువులకు ఎటువంటి రోగాలు రాకుండా ఉండాలని ప్రజలందరూ ఆయురారోగ్యాలతో ఉండాలని,ఆ శీతల భవాని మాతను కొలుచుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బానోత్ వనిత రమేష్ నాయక్, బాపురావు నాయక్,రెడ్డి నాయక్,రాజు నాయక్,శ్రీనివాస్ నాయక్ సురేందర్ నాయక్,గంగాధర్ నాయక్, తిరుపతి నాయక్,బలరాం నాయక్ మహిళలు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## అమరుడు దాసరి రమేష్‌కు జీఎంపీఎస్ ఘన నివాళి

**కొమురవెల్లి, జూలై 7 (తెలంగాణ వాణి):**



గొర్రెలు, మేకల పెంపకందారుల సంఘం (జీఎంపీఎస్) రాష్ట్ర కమిటీ చేపట్టిన అమరుల స్ఫూర్తి యాత్రలో భాగంగా మంగళవారం కొమురవెల్లి మండలం రాంసాగర్ గ్రామానికి చేరుకుని అమరుడు దాసరి రమేష్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళు లర్పించింది. ఈ సందర్భంగా జరిగిన సభలో జీఎంపీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కిల్లె గోపాల్ మాట్లాడుతూ, గొల్ల--కురుమల సమస్యల పరిష్కారం కోసం దాసరి రమేష్ చేసిన పోరాటాలను కొనియాడారు. ఆయన ఆశయ సాధన కోసం సంఘం చేపట్టే ఉద్యమాల్లో అందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సహాయ కార్యదర్శి బొల్లం అశోక్, రాష్ట్ర కమిటీ సభ్యులు కడెం లింగయ్య, చల్ల మల్లయ్య జిల్లా కమిటీ సభ్యులు దాసరి మహేష్, పెద్ద గొల్ల గంగుల మల్లయ్య, గంగుల ఐలయ్య, దువ్వల రాజయ్య, దువ్వల వెంకటయ్య, దువ్వల కనకయ్య, గంగుల వెంకటేష్, దువ్వల శ్రీకాంత్, గంగుల అనిల్, గంగుల పోషయ్య తదితరులు పాల్గొన్నారు.

## యశ్వంతరావు పేటలో నూతన అంగన్ వాడీ కేంద్రాన్ని ప్రారంభించిన మంత్రి అడ్లూరి

**జగిత్యాల/ బుగ్గారం: 7 జులై (తెలంగాణ వాణి విలేకరి)**
జగిత్యాల జిల్లా బుగ్గారం మండలం యశ్వంతరావుపేట గ్రామములో మంగళవారం రోజున అంగన్ వాడి కేంద్ర నూతన భవనాన్ని సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ప్రారంభోత్సవం చేశారు.
ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అంగన్ వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులకు, బాలింతలు, గర్భిణీలకు పౌష్టికాహారం అందించాలని మంత్రి అన్నారు. యశ్వంత రావు పేట గ్రామంలో ఉపాధి హామీ నిధులు రూ. 12 లక్షలతో నూతనంగా నిర్మించిన అంగన్ వాడీ కేంద్రాన్ని మంత్రి అడ్లూరి ప్రారంభిస్తూ, అంగన్వాడి కేంద్రాల ద్వారా ప్రభుత్వం చిన్నారులకు పౌష్టిక ఆహారం అందించడంతో పాటు ప్రీ ప్రైమరీ విద్యను అందిస్తున్నట్లు మంత్రి



తెలిపారు. బాలింతల విషయంలో సైతం ప్రభుత్వం ప్రత్యేక జాగ్రత్తలు తీసుకుంటుందని మంత్రి వివరించారు. అంగన్వాడి సేవలను ప్రతి ఒక్కరు ఉపయోగించుకోవాలని మంత్రి పేర్కొన్నారు. అనంతరం యశ్వంతరావు పేట గ్రామానికి చెందిన షేక్ సమీద్ తమ్ముడు షేక్ సమీర్ వివాహము ఈనెల 6వ తేదిన జరుగగా మంగళవారం మంత్రి లక్ష్మణ్ కుమార్ సమీర్ దంపతులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మండల సర్పంచులు రెవెన్యూ అధికారులు మరియు ఎంపీడీవో అధికారులు గ్రామ సర్పంచ్ ఉరు మెట్ల లక్ష్మీ బుచ్చయ్య ఉప సర్పంచ్ కోల శ్రీనివాస్, గ్రామ సెక్రెటరీ మాజీ జెడ్పిటీసీ బాధినేని రాజేందర్, వేముల సుభాష్,బుగ్గారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నర్సగౌడ్ కాంగ్రెస్ నాయకులు అంగన్వాడి సిబ్బంది ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ఎమ్మార్పీఎస్ 32వ ఆవిర్భావ దినోత్సవం, మందకృష్ణ మాదిగ జన్మదిన వేడుకలు



**ధర్మారం, జూన్ 07 (తెలంగాణ వాణి):**
ఎమ్మార్పీఎస్ 32వ ఆవిర్భావ దినోత్సవం, ఉద్యమ నిర్మాత మందకృష్ణ మాదిగ జన్మదిన వేడుకలను మంగళవారం ధర్మారం మండల కేంద్రంలోని గౌతమ బుద్ధ ఫంక్షన్ హాలులో ఎమ్మార్పీఎస్ మండల కోకన్వీనర్ నెరువట్ల అభిలాష్, ఎమ్మార్పీఎస్ మండల ఇన్చార్జి మద్దినాల మల్లేశం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా కేక్ కట్ చేసి స్వీట్లు పంచుకున్నారు. అనంతరం ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కాంగ్రెస్ పార్టీ సేవాదళ్ జిల్లా అధ్యక్షులు బొల్లి స్వామి హాజరై మాట్లాడుతూ.. ఉద్యమ నిర్మాత పద్మశ్రీ మందకృష్ణ మాదిగ జన్మదినోత్సవాన్ని జరుపుకోవడం ఆనందంగా ఉందన్నారు. ఎమ్మార్పీఎస్ ఉద్యమం సామాజిక న్యాయం, మాదిగల హక్కుల సాధన, ఎస్సీ వర్గీకరణ లక్ష్యాలతో మూడు దశాబ్దాలుగా పోరాడి వర్గీకరణ సాధించడం ఈ దేశంలోనే గొప్ప చరిత్రగా నిలుస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ లు ఇరుగురాల మహేష్, దూడ ప్రియాంక తిరుపతి, ఏఎంసీ డైరెక్టర్ కాంపల్లి రాజేశం, సామాజిక కార్యకర్త సుంచు మల్లేశం, వికలాంగుల హక్కుల పోరాట సమితి మండల గౌరవ అధ్యక్షులు గుమ్మడి రమేష్, గంగయ్య, నాయకులు గాజుల లక్ష్మణ్, శాతరాజుల సుమన్,బొల్లి అరుణ్,బానోతు తిరుపతి నాయక్, కళ్లెపెల్లి మహేష్, రత్నం తదితరులు పాల్గొన్నారు.

## ఆర్థిక శాఖ ఆదేశాలున్నా క్షేత్రస్థాయిలో నిర్లక్ష్యం.! అందని అవుట్ సోర్సింగ్ వేతనాలు

**ఒకటో తేదీన వేతనాలు అందేలా చూడలంటూ పాలిటెక్నిక్ అవుట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ విజ్ఞప్తి.**

**హైదరాబాద్:జూన్06(తెలంగాణ వాణి ప్రతినిది)**
రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల్లో పనిచేస్తున్న అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు ప్రతి నెల ఒకటో తేదీనే వేతనాలు చెల్లించాలని 'తెలంగాణ గవర్నమెంట్ పాలిటెక్నిక్ అవుట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ అసోసియేషన్' ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. ఈ నెల 1వ తేదీన కొంతమందికి మాత్రమే వేతనాలు అందించి, మిగిలిన వారికి నిలిపివేయడంపై అసోసియేషన్ తీవ్ర ఆవేదన వ్యక్తం చేసింది. ?అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలపై సానుకూలంగా స్పందిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఈ సందర్భంగా అసోసియేషన్ రాష్ట్ర ప్రతినిధులు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. అయితే, ఆర్థిక శాఖ గతంలో ఇచ్చిన ఉద్యోగ కొనసాగింపు గడువు జూన్ 30తో ముగిసిందని వారు గుర్తు చేశారు. కావున ముఖ్యమంత్రి తక్షణమే స్పందించి, అన్ని ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు తదుపరి రెన్యువల్ జీవోలు ఇచ్చేలా ఆర్థిక శాఖకు ఆదేశాలు జారీ చేయాలని కోరారు. ?ఆర్థిక శాఖ జూన్ 30 తర్వాత కూడా ఎలాంటి రెన్యువల్ జీవోలు లేకున్నా వేతనాలు ఇవ్వాలని స్పష్టమైన ఉత్తర్వులు జారీ చేసినప్పటికీ, క్షేత్రస్థాయిలో అధికారులు వాటిని సక్రమంగా అమలు చేయడం లేదని వారు ఆరోపించారు. కొన్ని కళాశాలల ప్రిన్సిపాల్స్ రెన్యువల్ జీవో లేదనే నెపంతో జీతాల బిల్లులను పంపడం లేదని, మరికొన్ని చోట్ల ఎస్టీఓ, డీటీఓ ట్రెజరీ కార్యాలయాల్లో బిల్లులను



తిరస్కరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే కొన్ని చోట్ల వివిధ కారణాలతో ఉద్యోగులను విధుల్లోంచి తొలగించి, ఇంతవరకు తిరిగి తీసుకోకపోవడం వల్ల వారి వేతనాలు పూర్తిగా నిలిచిపోయాయని పేర్కొన్నారు. ?ఒకటో తేదీన జీతాలు అందకపోవడంతో అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల పరిస్థితి "అందని ద్రాక్షపండు"లా తయారైందని, ఇళ్ల అద్దెలు, పిల్లల ఫీజులు, నిత్యావసర ఖర్చుల కోసం కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయని అసోసియేషన్ అధ్యక్షులు మారపల్లి సుధాకర్, ప్రధాన కార్యదర్శి సి.హెచ్. బాబు ఆందోళన వ్యక్తం చేశారు. సాంకేతిక విద్యా శాఖ కమిషనర్ ఈ అంశాన్ని సానుభూతితో పరిశీలించి, ఎలాంటి సాంకేతిక ఇబ్బందులు లేకుండా ప్రతి నెల 1వ తేదీనే వేతనాలు అందేలా తగిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

## జర్నలిస్టులకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పించాలి

**10న రాష్ట్రవ్యాప్తంగా ఆర్టీసీ అధికారులకు వినతులు**

**జగిత్యాల/హైదరాబాద్: జులై 7 (తెలంగాణ వాణి ప్రతినిధి)**
రాష్ట్రవ్యాప్తంగా జర్నలిస్టులకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సదుపాయం కల్పించాలని కోరుతూ ఈనెల 10వ తేదీన "జర్నలిస్టుల వినతులు"అనే కార్యక్రమం చేపట్టనున్నట్టు తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మామిడి సోమయ్య, తన్నీరు శ్రీనివాస్ లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం జర్నలిస్టులకు ఆర్టీసీ బస్ చార్జీల్లో 1/3 వంతు రాయితీ కల్పించినప్పటికి ఆర్టీసీ సంస్థ మాత్రం దాదాపు 50 శాతం చార్జీలు వసూలు చేస్తున్నారని, దీనివల్ల నిత్యం వార్తా సేకరణకు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించే జర్నలిస్టులకు భారమవుతుందని అన్నారు. ప్రభుత్వం చాలా ఏళ్ళుగా జర్నలిస్టులకు ఆర్టీసీ బస్సుల్లో 1/3 రాయితీ పై ప్రయాణ సదుపాయం అమలు చేస్తుందని, అయితే ఇటీవల కాలంలో టోల్ ఫీజు, సర్వీస్ చార్జి పేరుతో మూడోవంతు చార్జీలను 50 శాతానికి పెంచారని తెలిపారు. పేరుకే 1/3 చార్జీలని, కానీ 50% చార్జీలు వసూలు చేస్తున్నారని అన్నారు. రాష్ట్రంలో అనేక మంది జర్నలిస్టులు సరైన వేతనాలు లేకపోయినప్పటికి జర్నలిజం వృత్తిలో కొనసాగుతూ ప్రభుత్వానికి, ప్రజలకు, ఆర్టీసీ సంస్థకు సేవలందిస్తున్నారని, అటువంటి జర్నలిస్టులు వార్తల సేకరణ కోసం ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించాల్సి వస్తుందని, ఫలితంగా ఆర్టీసీ ప్రయాణ చార్జీల భారం విపరీతంగా పడుతుందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా




మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించిన ప్రభుత్వం, ఆర్టీసీ సంస్థ...కొద్ది సంఖ్యలో ఉన్న జర్నలిస్టులకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించకపోవడం బాధాకరమని అన్నారు. జర్నలిస్టులకు ఉచిత ప్రయాణ సదుపాయం కల్పించడం వల్ల ప్రభుత్వానికి, ఆర్టీసీ సంస్థకు పెద్ద ఆర్థిక భారమేమీ పడదని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే జర్నలిస్టులకు అన్ని అర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సదుపాయం కల్పించాలని వారు కోరారు. ఈ నెల 10వ తేదీన రాష్ట్ర రవాణా శాఖ మంత్రితో పాటు రాష్ట్రవ్యాప్తంగా ఆర్టీసీ అధికారులకు అనగా ఆర్టీసీ వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు, రీజినల్ మేనేజర్లు, డివిజనల్ మేనేజర్లు డిపో మేనేజర్లకు వినతి పత్రాలు ఇవ్వనున్నట్లు తెలిపారు

## వెలిమల--కొల్లూరు--నాగులపల్లిలో కాంగ్రెస్ బీఎల్ఏ, ఎస్ఐఆర్ కార్యక్రమాలు

**తెల్లాపూర్, జూలై 7 (తెలంగాణ వాణి):**
కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో వెలిమల, కొల్లూరు, నాగులపల్లి ప్రాంతాల్లో బీఎల్ఏ, ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమాలు నిర్వహించారు.వెలిమల బూత్‌లు 390, 391, 392తో పాటు నాగులపల్లి బూత్‌లు 393, 394, 395లో ఓటరు జాబితా పరిశీలన చేపట్టగా, కొల్లూరు డబుల్ బెడ్‌రూమ్ కాలనీలోనూ ఓటర్ల వివరాల ధృవీకరణ నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు బీఎల్‌ఏలు, బీఎల్‌వోలతో కలిసి ప్రతి అర్హుడైన ఓటరు పేరు జాబితాలో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.





## గంగాపూర్ కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడిగా ఒరుపుల లచ్చయ్య ఎన్నిక

**జగిత్యాల/బుగ్గారం, జూలై 7 (తెలంగాణ వాణి):**
జగిత్యాల జిల్లా బుగ్గారం మండలం గంగాపూర్ గ్రామ కాంగ్రెస్ పార్టీ నూతన గ్రామ శాఖ కమిటీని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఆదేశాల మేరకు, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు నగునూరి నర్సగౌడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. గ్రామ శాఖ అధ్యక్షుడిగా ఒరుపుల లచ్చయ్య ఎన్నిక కాగా, ఆయనను కాంగ్రెస్ నాయకులు శాలువాతో ఘనంగా సన్మానించారు. నూతన కమిటీ సభ్యులకు మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ శుభాకాంక్షలు తెలిపారు. కమిటీ ఉపాధ్యక్షులుగా చెక్కపెల్లి గంగయ్య, జనరల్ సెక్రెటరీగా, గోలి రాజన్న కోశాధికారిగా గందరి మల్లేష్, సెక్రటరిగా ధనల ఆశన్న, సంబరాశి ప్రకాష్, గుర్రం రాజిరెడ్డి, దాసరి శంకరయ్య, చెక్కపల్లి రాజయ్య, ఏషాల రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా మందకృష్ణ మాదిగ జన్మదిన వేడుకలు



**వనపర్తి, జూలై 7 (తెలంగాణ వాణి):**
మాదిగ ఎంప్లాయీస్ ఫెడరేషన్ (ఎంఈఎఫ్) వనపర్తి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో పద్మశ్రీ మందకృష్ణ మాదిగ 62వ జన్మదినం, ఎమ్మార్పీఎస్ 32వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన ఏఐఎంఈఎఫ్ ఉపాధ్యక్షుడు గద్వాల కృష్ణ కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం జిల్లా ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులకు యాపిల్స్, అరటి పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాన్ని ఎం.ఈ.ఎఫ్. జిల్లా అధ్యక్షులు బొరెల్లి వెంకటయ్య , సీనియర్ నాయకులు కేశపాగ కేశవులు , ఎం.ఆర్.పి.ఎస్. జిల్లా అధ్యక్షులు కొమ్ము కేశవులు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎం.ఈ.ఎఫ్., ఎమ్మార్పీఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని పద్మశ్రీ మంద కృష్ణ మాదిగకి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసి, సామాజిక న్యాయం కోసం ఆయన చేస్తున్న సేవలను కొనియాడారు.

## కాళేశ్వరంపై సీబీఐ విచారణ జరిపించాలి: మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్

**ధర్మారం, జూలై 7 (తెలంగాణ వాణి):**



కేంద్ర ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్టుపై సీబీఐ విచారణకు ఆదేశించాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ డిమాండ్ చేశారు. పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలంలోని లంబాడి తండాలో శీత్ల పండుగ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లా డుతూ, రాష్ట్ర ప్రభుత్వం కాళేశ్వరం అంశాన్ని సీబీఐ విచారణకు పంపిస్తూ తీర్మానం చేసినప్పటికీ కేంద్రం చర్యలు తీసుకోవడం లేదన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై సీబీఐ విచారణకు కేంద్రం ఆదేశిస్తేనే బీజేపీ, బీఆర్ఎస్ వేర్వేరు పార్టీలని నమ్ముతామని, లేకపోతే రెండూ ఒక్కటేనని ప్రజలకు చెబుతామని మంత్రి వ్యాఖ్యానించారు.

## చేనేత సహకార సంఘం అభివృద్ధే లక్ష్యం: వనం సుదర్శన్



**చౌటుప్పల్, జూలై 7 (తెలంగాణ వాణి):**
కుంట్లగూడెం చేనేత సహకార సంఘాన్ని అభివృద్ధి చేయడమే తన లక్ష్యమని సంఘం చైర్మన్ అభ్యర్థి వనం సుదర్శన్ అన్నారు. చైర్మన్, డైరెక్టర్ల ఎన్నికల నేపథ్యంలో ఆయన తన ప్యానెల్ అభ్యర్థులతో కలిసి చేనేత కార్మికుల వద్ద ప్రచారం నిర్వహించారు. తాను విజయం సాధిస్తే ప్రతి చేనేత కార్మికుడికి ఉపాధి కల్పించడం, జియోట్యాగ్ అమలు, ముడి సరుకులను సబ్సిడీపై అందించడం కోసం కృషి చేస్తానని తెలిపారు. అవినీతికి తావులేకుండా నిజాయితీతో సంఘాన్ని నిర్వహిస్తానని పేర్కొంటూ తన ప్యానెల్‌కు మద్దతు ఇవ్వాలని కార్మికులను కోరారు.

# తిరుమలయ్య గుట్టను పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలి: సతీష్ యాదవ్



**వనపర్తి, జూలై 7 (తెలంగాణ వాణి):**
వనపర్తి జిల్లా కేంద్రానికి సమీపంలోని తిరుమలయ్య గుట్టను పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలని అఖిలపక్ష ఐక్యవేదిక అధ్యక్షుడు సతీష్ యాదవ్ కోరారు. మంగళవారం భక్తులతో కలిసి శ్రీ వెంకటేశ్వర స్వామిని దర్శించుకున్న అనంతరం ఆయన ఈ విజ్ఞప్తి చేశారు. తిరుమలయ్య గుట్టకు రూ.5 నుంచి రూ.10 కోట్ల వరకు నిధులు కేటాయించి మౌలిక వసతులు కల్పిస్తే భక్తుల రాక పెరిగి వనపర్తి జిల్లాలో ప్రముఖ ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చెందుతుందని తెలిపారు. త్వరలో జిల్లాకు రానున్న ముఖ్యమంత్రి, స్థానిక ప్రజాప్రతినిధులు ఈ అంశంపై ప్రత్యేక దృష్టి సారించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో అఖిలపక్ష ఐక్యవేదిక అధ్యక్షుడు సతీష్ యాదవ్, కాంగ్రెస్ నాయకులు వెంకటేశ్వర్లు, టిడిపి నాయకులు కొత్త గొల్ల శంకర్, టిఆర్ఎస్ నాయకులు ప్రేమ్ నాథ్ రెడ్డి, అఓపా సంగం నాయకులు శ్రీనివాసులు, వెంకటేశ్వర్ రెడ్డి, చందు యాదవ్, బాలరాజు, భక్తులు, ఆర్యవైశ్య సంఘం నాయకులు పాల్గొన్నారు.

# విద్యార్థిని భావన కార్తీకను అభినందించిన డీజీపీ సీవీ ఆనంద్




**భద్రాద్రి బ్యూరో, జూలై 7 (తెలంగాణ వాణి)**
జిల్లా పర్యటనకు వచ్చిన తెలంగాణ రాష్ట్ర డీజీపీ సీవీ ఆనంద్, చుంచుపల్లి పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న గరిడేపల్లి రవికుమార్ కుమార్తె గరిడేపల్లి భావన కార్తీకను అభినందించారు. పాల్వంచలోని శ్రీ విద్యా స్కూల్‌లో పదో తరగతి చదువుతున్న భావన కార్తీక, రాష్ట్ర స్థాయి రైఫిల్ షూటింగ్ పోటీల్లో పిస్టల్ విభాగంలో ప్రతిభ కనబర్చి సౌత్ జోన్ పోటీలకు అర్హత సాధించింది. ఈ సందర్భంగా డీజీపీ ఆమెను అభినందిస్తూ, జాతీయ స్థాయిలో రాణించి తెలంగాణకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఐజీ చంద్రశేఖర్, జిల్లా ఎస్పీ రోహిత్ రాజు తదితరులు పాల్గొన్నారు.

# అగ్నిప్రమాద బాధిత కుటుంబాన్ని పరామర్శించిన జూపల్లి రమేష్‌బాబు



**అశ్వరావుపేట, జూలై 7 (తెలంగాణ వాణి):**
అశ్వరావుపేట మండలం అచ్యుతాపురం గ్రామంలో పాకనాటి పోలయ్యకు చెందిన పూరిల్లు అగ్నిప్రమాదంలో పూర్తిగా దగ్ధమైంది. విషయం తెలుసుకున్న అశ్వరావుపేట మున్సిపల్ వైస్ చైర్మన్ జూపల్లి రమేష్‌బాబు సంఘటన స్థలానికి చేరుకుని బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ాధితులకు ధైర్యం చెప్పిన ఆయన, స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, అధికారులతో మాట్లాడి ప్రభుత్వ పరంగా అవసరమైన సహాయం అందేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# చర్ల మండల మహిళకు రూ.29,500 సీఎం రిలీఫ్ ఫండ్ సహాయం



**భద్రాచలం, జూలై 7 (తెలంగాణ వాణి)**
చర్ల మండలానికి చెందిన లబ్ధిదారిణికి తెలంగాణ ప్రభుత్వం మంజూరు చేసిన ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎం రిలీఫ్ ఫండ్) చెక్కును స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు మంగళవారం భద్రాచలం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అందజేశారు. చర్ల మండలం కొయ్యూరు గ్రామానికి చెందిన దుబ్బ సుధారాణికి వైద్య చికిత్స నిమిత్తం మంజూరైన రూ.29,500 విలువైన చెక్కును ఎమ్మెల్యే అందించారు.
ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ఆపదలో ఉన్న పేద కుటుంబాలకు సీఎం రిలీఫ్ ఫండ్ ఎంతో ఊరటనిస్తోందని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, అర్హులైన ప్రతి బాధిత కుటుంబానికి ప్రభుత్వం అండగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఆర్థిక సహాయం అందుకున్న దుబ్బ సుధారాణి రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# పారదర్శకంగా ఎస్ఐఆర్ ప్రక్రియ పూర్తి చేస్తాం

**జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా.**





**నిర్మల్, జూలై 07(తెలంగాణ వాణి ప్రతినిధి)**
స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఓటరు జాబితా ప్రత్యేక సవరణ, ఎస్ఐఆర్) ప్రక్రియను పూర్తి పారదర్శకంగా చేపడతామని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అన్నారు. జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా, మంగళవారం సాయంత్రం కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో, జిల్లాలో చేపట్టనున్న ఎస్ఐఆర్ ప్రక్రియపై వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఎస్ఐఆర్ ప్రక్రియ వివరాలను సమగ్రంగా వివరించారు. ఇప్పటికే బూత్ లెవెల్ అధికారుల (బిఎల్ఓ ల) ద్వారా ఎన్యుమరేషన్ ఫాం ల పంపిణీ పూర్తయిందని తెలిపారు. ఓటర్లు నింపిన వివరాలతో కూడిన ఎన్యుమరేషన్ ఫారం లు జూలై 24 తేదీ వరకు తిరిగి తీసుకుంటారు అని వివరించారు. ప్రస్తుతం ఎన్యుమరేషన్ ఫాం ల స్వీకరణ, డిజిటలీకరణ ప్రక్రియ కూడా కొనసాగుతుందన్నారు. గడువులోగా డిజిటలీకరణ పూర్తి చేస్తామన్నారు. అర్హులైన ఏ ఒక్క నిజమైన ఓటరు కూడా తమ ఓటు హక్కు కోల్పోకుండా, పారదర్శకంగా ఎస్ఐఆర్ ప్రక్రియను పూర్తి చేస్తామని అన్నారు. ప్రతి బుధవారం ఈఆర్వోల స్థాయిలో సమావేశాలు నిర్వహిస్తున్నామన్నారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు ఈ సందర్భంగా లేవనెత్తిన అంశాలను కలెక్టర్ వివరించారు. ప్రజల్లో మరింత అవగాహన కలిగేలా ఆటోల ద్వారా టామ్ టామ్ చేసి ప్రచారం కల్పిస్తామని తెలిపారు. హెల్ప్ డెస్క్ ల ద్వారా ఓటర్లకు సహాయం చేస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, డిఆర్ఓ రాథోడ్ రమేష్, ఆర్డీఓలు దేవీ దాస్, మోహన్ సింగ్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, తహసిల్దార్లు, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్ ప్రక్రియను పూర్తి ఖచ్చితత్వంతో నిర్వహించాలి : కలెక్టర్ దివాకర్ టీఎస్



**మధిర, జూలై 7 (తెలంగాణ వాణి):**
ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు పారదర్శకంగా, నిష్పాక్షికంగా, పూర్తి ఖచ్చితత్వంతో నిర్వహించాలని జిల్లా కలెక్టర్ దివాకర్ టీఎస్ అధికారులను ఆదేశించారు. మంగళవారం మధిర, ఎర్రుపాలెం మండలాల్లో కొనసాగుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియను ఆకస్మికంగా తనిఖీ చేసిన ఆయన, ఇంటింటికీ ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ, స్వీకరణ, డిజిటైజేషన్ ప్రక్రియను పరిశీలించారు. ప్రతి బీఎల్ఓ బీఎల్ఓ యాప్ ద్వారా వివరాలను నమోదు చేసి, పూర్తి చేసిన ఫారాలను గడువులోగా డిజిటైజేషన్ చేయాలని సూచించారు. ఓటర్ల సందేహాలను వెంటనే నివృత్తి చేసి, ఎలాంటి అపోహలకు తావులేకుండా అవగాహన కల్పించాలని అధికారులకు ఆదేశించిన కలెక్టర్, అర్హులైన ప్రతి ఓటరు వివరాలు తప్పుల్లేకుండా నమోదు కావడానికి అధికారులు, రాజకీయ పార్టీలు, ప్రజలు సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ వెంట ఖమ్మం ఆర్డీవో శ్రీనివాస్, మధిర మండల తహసీల్దార్ రాంబాబు, ఎర్రుపాలెం మండల తహసీల్దార్ సునీత ఎల్జిబెత్, మధిర మున్సిపల్ కమిషనర్, సూపర్వైజర్లు,ఎబూత్ స్థాయి అధికారులు (బీఎల్ఓలు), సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు...

## కేజిబివిలో అసిస్టెంట్ కుక్ పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానం

**లక్షెట్టిపేట, జూలై 07(తెలంగాణ వాణి).**
మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాలలో ఖాళీగా ఉన్న అసిస్టెంట్ కుక్ పోస్టును భర్తీ చేసేందుకు స్థానిక మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మండల విద్యాధికారి శైలజ ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు చేయు అభ్యర్థులు మహిళలు మాత్రమే అయి ఉండాలి. కనీసం 7వ తరగతి ఉత్తీర్ణత ఉండాలి. 22.07.2025 నాటికి వయస్సు 18 నుండి 45 సంవత్సరాల మధ్య ఉండాలి. స్థానిక తహసీల్దార్ జారీ చేసిన నివాస ధృవీకరణ పత్రం తప్పనిసరి. 7వ తరగతి మెమో, బోనఫైడ్ సర్టిఫికెట్, ఆధార్ కార్డు, నివాస ధృవీకరణ పత్రాలను దరఖాస్తుతో పాటు జత చేయాలి. ఆసక్తి గల అభ్యర్థులు 08.07.2026 నుండి 10.07.2026 సాయంత్రం 4 గంటలలోపు మండల విద్యా వనరుల కేంద్రం, లక్షెట్టిపేట కార్యాలయంలో నేరుగా దరఖాస్తులు సమర్పించాలని మండల విద్యాధికారి శైలజ సూచించారు.

## బొగత జలపాతాన్ని ఆకర్షణీయమైన పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలి

**జిల్లా కలెక్టర్ బోర్ఢడే హేమంత్ సహదేవరావు**



**ములుగు,జులై7 (తెలంగాణ వాణి)**
ములుగు జిల్లా వాజేడు మండలంలోని బొగత జలపాతాన్ని రాష్ట్రంలోనే ప్రముఖ పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తూ పర్యాటకులను ఆకర్షించే విధంగా అన్ని ఏర్పాట్లు చేయాలని,స్థానిక సాంప్రదాయ వంటకాలను పర్యాటకులకు అందుబాటులో ఉంచే విధంగా ఇందిరా మహిళా శక్తి ఫుడ్ కోర్ట్ ఏర్పాటు చేయాలని సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు బొగత జలపాతం అభివృద్ధి,పర్యాటకులకు కల్పించాల్సిన సౌకర్యాలు,ఇందిరా మహిళా శక్తి ఫుడ్ కోర్ట్ నిర్వహణ, స్వయం సహాయక సంఘాల భాగస్వామ్యం తదితర అంశాలపై సంబంధిత శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ బొగత జలపాతాన్ని సందర్శించే పర్యాటకులకు ఆహ్లాదకరమైన అనుభూతిని కల్పించేలా పరిసరాలను పరిశుభ్రంగా,ఆకర్షణీయంగా తీర్చిదిద్దాలని సూచించారు. తాగునీరు,పారిశుధ్యం,పార్కింగ్,విశ్రాంతి సౌకర్యాలు,భద్రత,దిశా నిర్దేశక బోర్డులు తదితర అన్ని మౌలిక సదుపాయాలను అందుబాటులో ఉంచాలని అధికారులను ఆదేశించారు. పర్యాటకులకు స్థానిక సంస్కృతి, సంప్రదాయ ఆహార రుచులను పరిచయం చేసేలా ఇందిరా మహిళా శక్తి ఫుడ్ కోర్ట్ ద్వారా జొన్న రొట్టె, బొంబూ చికెన్, నాటుకోడి, చేపల వంటకాలు, తదితర సాంప్రదాయ వంటకాలను అందుబాటులో ఉంచాలని సూచించారు. స్థానిక మహిళా స్వయం సహాయక సంఘాలకు కల్పిస్తున్న ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఉపాధితో పాటు ఆదాయాన్ని పెంచుకోవాలని అన్నారు.

## బాసర ఆటో యూనియన్ అధ్యక్షుడిగా గురప్ప శంకర్ మళ్లీ ఏకగ్రీవం

**నిర్మల్ - బాసర: జూన్ 07 (తెలంగాణ వాణి ప్రతినిధి)**



బాసర ఆటో కార్మిక సంఘం (ఆటో యూనియన్) అధ్యక్షుడిగా గురప్ప శంకర్ వరుసగా రెండోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.ఆటో కార్మికుల సంక్షేమం, హక్కుల పరిరక్షణ కోసం ఆయన చేసిన సేవలను గుర్తించిన సభ్యులు మరోసారి ఆయనకే నాయకత్వ బాధ్యతలు అప్పగించారు. ఈ సందర్భంగా యూనియన్ సభ్యులు గురప్ప శంకర్‌కు ఘనంగా అభినందనలు తెలియజేస్తూ ఆయన నాయకత్వంలో ఆటో కార్మికుల సంక్షేమం కోసం మరింత సమర్థంగా పనిచేస్తామని తెలిపారు.

## టేకులపల్లిలో ఘనంగా సీత్ల (దాటుడు) పండుగ వేడుకలు

**బంజారా వస్త్రధారణలో ఆకట్టుకున్న చిన్నారి**



**టేకులపల్లి, జూలై 7 (తెలంగాణ వాణి):**
టేకులపల్లి మండలంలోని పలు గిరిజన తండాల్లో మంగళవారం సీత్ల (దాటుడు) పండుగను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. బంజారా సంప్రదాయ వస్త్రధారణలో మహిళలు, చిన్నారులు, యువతులు డప్పు చప్పుళ్ల మధ్య నృత్యాలు చేస్తూ ఆరాధ్య దేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ామాలు సుభిక్షంగా ఉండాలని, వర్షాలు సమృద్ధిగా కురవాలని, పశుసంపద, ప్రజలు ఆయురారోగ్యాలతో ఉండాలని ప్రార్థించారు. అనంతరం సంప్రదాయం ప్రకారం బలిహరణ నిర్వహించి పశువులను దాటించారు. వేడుకల్లో గిరిజన పెద్దలు, మహిళలు, యువత, చిన్నారులు పాల్గొని సామూహిక వనభోజనాలు చేశారు.

## ఆపరేషన్ ముస్కాన్-XIIలో భాగంగా విస్తృత తనిఖీలు

**చైల్డ్ హెల్ప్ లైన్ 1098 ఉచిత నెంబర్ పై అవగాహన**



**కరీంనగర్, జులై 07 (తెలంగాణ వాణి)**
కరీంనగర్ జిల్లాలో నిర్వహిస్తున్న ఆపరేషన్ ముస్కాన్--XII కార్యక్రమంలో భాగంగా, చైల్డ్ హెల్ప్ లైన్ 1098 ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ సంపత్,మానవ అక్రమ రవాణా నిరోధక విభాగం (ఏహెచ్‌టీయూ) బృందంతో కలిసి కరీంనగర్ అర్బన్ పరిధిలోని భవన నిర్మాణ పనులు జరుగుతు న్న ప్రాంతాలు,హోటళ్లు మరియు ఇతర ప్రాంతాల్లో విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు.ఈ సందర్భం గా చైల్డ్ హెల్ప్ లైన్ 1098 ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ సంపత్ మాట్లాడుతు తప్పిపోయిన పిల్లలు,బాల కార్మికులు, అక్రమ రవాణాకు గురైన పిల్లలు ఎవరైనా ఉన్నారా అనే అంశాలపై క్షుణ్ణంగా పరిశీలించామని అన్నారు. తనిఖీల సమయంలో కార్మికులు,హోటల్ యజమానులు మరియు సంబంధిత నిర్వాహకులతో మాట్లాడి బాలల హక్కులు,బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన,బాలల అక్రమ రవాణా నివారణపై అవగాహన కల్పించామని,అదేవిధంగా,ఎక్కడైనా తప్పిపోయిన పిల్లలు,బాల కార్మికులు లేదా అక్రమ రవాణాకు గురైన పిల్లలు కనిపించినట్లయితే వెంటనే చైల్డ్ హెల్ప్ లైన్ 1098 ఉచిత నంబర్‌కు లేదా 100కు ఫోన్ చేసి సమాచారం అందించా లని కోరారు.ప్రజల సహకారం తోనే ప్రతి చిన్నారికి రక్షణ కల్పించడం సాధ్యమవు తుందని తెలిపారు.
ఈ కార్యక్రమంలో మానవ అక్రమ రవాణా నిరోధక విభాగం (ఏహెచ్‌టీయూ) బృందశీ మల్లేశం,సురేందర్ పాల్,స్నేహ తదితరులు పాల్గొన్నారు

## పోలీస్ స్టేషన్ తనిఖీ చేసిన డిసిపి రాంరెడ్డినాయక్



**ధర్మారం, జూన్ 7 (తెలంగాణ వాణి)**
పెద్దపల్లి జిల్లా ధర్మారం మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ ను డీసీపీ రాంరెడ్డి మంగళవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఏసీబీ గజ్జి కృష్ణ, సీఐ ఎం ప్రవీణ్ కుమార్ తో కలిసి స్టేషన్ రికార్డులు, పెండింగ్ కేసులను పరిశీలించారు, ఈగల్ ఫోర్స్ ద్వారా డ్రగ్స్ నియంత్రణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించడంతోపాటు గ్రామాల్లో సీసీ కెమెరాల ఏర్పాటును పెంచాలని ఆదేశించారు. సివిల్ వివాదాల్లోకి పోలీసులను లాగొద్దని ఈ సందర్భంగా తెలిపారు. గత ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో జరిగేలా చూసిన సీఐ, ఎస్ఐ ని అభినందించారు. దొంగతనాలు జరగకుండా సీసీ కెమెరాలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని నేను సైతం కార్యక్రమాల్లో భాగంగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేసేందుకు దాతలు ముందుకు రావాలని కోరారు. డ్రగ్స్ అవేర్నెస్ ప్రోగ్రాంలో ఎస్పీ మహారాజ్ ను ఆహ్వానించి అనేక ప్రోగ్రాం లు నిర్వహించడం జరిగినదని ఇటీవల ధర్మారం మండలంలోని కొత్తూరు గ్రామంలో సాయంత్రం 6 గంటల నుండి రాత్రి 10 గంటల వరకు నిర్వహించిన కార్యక్రమంలో ప్రజలు అధిక సంఖ్యలో హాజరవడం సంతోషంగా ఉందన్నారు. సైబర్, అలైబలై కార్యక్రమాలు నిర్వహించి పిల్లల పట్ల తల్లిదండ్రులు ప్రత్యేక దృష్టి సారించాలని ఎలాంటి డ్రగ్స్ లకు అలవాటు కాకుండా చూసుకోవాలని టీ కొట్టుల్లో అమ్ముతున్న సిగరెట్లను డ్రగ్స్ నివారించేందుకు పోలీసులు తీసుకున్న చర్యలపై స్థానిక ఎస్సైని ప్రత్యేకంగా అభినందించారు.ఈ కార్యక్రమంలో ఏసీపీ గజ్జి కృష్ణ, సీఐ ఎం ప్రవీణ్ కుమార్, స్థానిక ఎస్సై ఎం ప్రవీణ్ కుమార్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## వేధింపులకు గురి చేస్తే షీ టీమ్స్‌ను ఆశ్రయించండి

**మందమర్రి జులై 07 (తెలంగాణ వాణి విలేకరి)**
మంచిర్యాల జిల్లా షీ టీమ్ ఎస్ఐ. హైమ ఆధ్వర్యం లో మహిళా భద్రతపై మంగళవారం స్థానిక తెలంగాణ మోడల్ పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.షీ టీమ్ సిబ్బంది మహిళల కోసం అమలు చేస్తున్న భద్రతా చర్యలు, ఈవ్‌టీజింగ్, సైబర్ నేరాలు,మానవ అక్రమరవాణా,ట్రాఫిక్ నియమాలు,టి–సేఫ్ యాప్, షీ టీమ్స్ సేవల గురించి సమగ్రంగా వివరించారు.అత్యవసర పరిస్థి తుల్లో వెంటనే పోలీసులను సంప్రదించా లని సూచిస్తూ, హెల్ప్‌లైన్ నంబర్లు డయల్ 100, రామగుండం షీ టీమ్ వాట్సాప్ నంబర్ 6303923700, మంచిర్యాల జిల్లా షీ టీమ్ నంబర్ 8712659385 లను తెలియజేశారు. సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని హామీ ఇచ్చారు.తెలంగాణ ప్రభు త్వం మహిళల భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇస్తూ రాష్ట్రవ్యాప్తంగా పటిష్ట చర్యలు తీసుకుం టోందని పేర్కొన్నారు. మహిళలు ఎటువంటి వేధింపులకు గురైనా భయపడకుండా వెంటనే ఫిర్యాదు చేయాలని సూచిం చారు. ఈ కార్యక్ర మంలో మంచిర్యాల జిల్లా షీ టీమ్ సిబ్బంది కానిస్టే బుళ్ల శ్రవణ్, శ్రీలత, ప్రిన్సిపాల్ సారా తస్నీం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.





## తెలంగాణకు కొత్తగా మద్యం బ్రాండ్లు

హైదరాబాద్: ప్రపంచంలో కొన్ని వేల రకాల మద్యం బ్రాండ్లు ఉన్నాయి. కానీ, మందుబాబులు ఎక్కువగా తాగేది బీరే. కొంతమంది కొత్త వైరైటీలు టేస్ట్ చేస్తారు. తెలంగాణ రాష్ట్రంలోనూ కొన్ని మద్యం బ్రాండ్లు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. కొత్త బ్రాండ్లు, విదేశీ బ్రాండ్లు కావాలని చాలా మంది కోరుకుంటుం టారు. అయితే, వారి కోరిక ఫలించేలా తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో కొత్త బ్రాండ్లకు అనుమతి ఇవ్వాలని డిసైడ్ అయింది. రాష్ట్రంలో త్వరలో నూతన మద్యం బ్రాండ్లు అందుబాటులోకి వచ్చే అవకాశాలున్నాయి. ఈ మేరకు గతంలో ప్రభుత్వం చేసిన కసరత్తు తర్వాత పెద్ద ఎత్తున విమర్శలు రాగా.. ఆ ప్రక్రియను తాత్కాలికంగా ప్రభుత్వం విరమించుకున్నది. అయితే, ప్రభుత్వం తాజాగా బడ్జెట్లో రాబడి అంచనాలను పెంచుకునేందుకు ఉన్న మార్గాలపై ఆరా తీయడంతో ఈ నిర్ణయం అమలు చేయనుందని తెలుస్తోందితెలంగాణ రాష్ట్రంలో ఇప్పటికే 1,956 బ్రాండ్లు అందుబాటులో ఉన్నాయి. రాష్ట్ర ప్రభుత్వం అనుమతిస్తే మరో 604 మద్యం బ్రాండ్లు రాష్ట్రంలోకి అడుగుపెట్టేందుకు ఎదురుచూస్తున్నాయి. వీటి అనుమతి కోసం సుమారు 92 కంపెనీలు ఉండగా.. ఇందులోబ్లెండర్స్ ప్రైడ్, రాయల్ ఛాలెంజ్, సులావైన్ వంటివి ఇక్కడ ఎక్కువగా అమ్ముడయ్యే బ్రాండ్లు ఉన్నాయి. కొత్తగా రాబోతున్న వాటిలో 15 విదేశీ బ్రాండ్లు, 15 దేశీయ లిక్కర్, 7 బీర్ బ్రాండ్లు, 37 కొత్త బ్రాండ్లు ఉన్నాయని తెలుస్తోంది. ఇటీవల ఎక్సైజ్ శాఖ అధికారులకు భారీగా నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్ (ఎన్డీపీఎల్) పట్టుబడింది. ఆ మద్యం సీసాల్లో లోకల్ బ్రాండ్లు లేకపోవడం, విదేశీ బ్రాండ్ మద్యం అక్రమ తరలింపు గుర్తించారు. ఈ ఎన్డీపీఎల్‌లో అత్యధికశాతం మన దగ్గర అందుబాటులో లేని జాతీయ, అంతర్జాతీయ బ్రాండ్‌లు ఉంటున్నాయని ఎక్సైజ్ అధికారులు చెప్తున్నారు. ప్రభుత్వం దగ్గర పెండింగ్‌లో ఉన్న బ్రాండ్లకు అనుమతి లభిస్తే ఈ ఎన్టీపీఎల్ సమస్య తగ్గుతుందని కొందరు అధికారులు పేర్కొంటున్నారు. కొత్తవాటికి అనుమతిస్తే.. ఒక్కో బ్రాండు రూ. 15 వేల చొప్పున అనుమతి ఫీజును వసూలు చేయనున్నారు. తద్వారా రూ. 90,45,000లు ప్రభుత్వానికి రాబడి వస్తుంది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే కొన్ని వివాదాస్పద మద్యం కంపెనీలకు అనుమతులు ఇచ్చేందుకు సిద్ధమైంది. అప్పటికే సదరు కంపెనీల నేపథ్యం వివాదాస్పదంగా ఉండటం, కొన్నిచోట్ల అవి కల్తీ మద్యం విక్రయించాయని తేలడంతో ప్రభుత్వం వాటితో ఒప్పందాలు రద్దు చేసుకున్నది. ఈ క్రమంలో అప్రమత్తమైన ఎక్సైజ్శాఖ వివాదాస్పద కంపెనీలను పక్కనపెట్టిన విషయం తెలిసిందే. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు అయిపోయాక.. కొత్త బ్రాండ్లకు గేట్లు తెరవాలని సర్కార్ ప్లాన్ చేస్తోంది. అంటే.. మార్చి లేదా ఏప్రిల్‌లో కొత్త మద్యం బ్రాండ్లు క్యూ కట్టే ఛాన్స్ ఉంది. ఇక అప్పుడు చూడాలి.. మందుబాబుల ఆనందం.. మామూలుగా ఉండదు.

## డ్రైవింగ్ లైసెన్స్ పై స్పెషల్ డ్రైవ్




హైదరాబాద్: హైదరాబాద్ వాహనదారులకు అలర్ట్. నగరంలో రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యంగా హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసులు మరో కీలకనిర్ణయం తీసుకున్నారు. ఇక నుంచి సరైన డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపేవారిపై కఠిన చర్యలు తీసుకోనున్నారు. మార్చినుండి నిరంతరాయంగా స్పెషల్ డ్రైవ్ నిర్వహించి చర్యలు తీసుకుంటామని సిటీ పోలీసులు హెచ్చరించారు. రోడ్డు ప్రమాదాల్లో ఎక్కువ శాతం లైసెన్స్ లేని డ్రైవర్ల వల్లే జరుగుతున్నాయని తాజాగా నగర ట్రాఫిక్ పోలీసులు గుర్తించారు. ఈ నేపథ్యంలో.. వాహనదారులు తప్పనిసరిగా ఒరిజినల్ డ్రైవింగ్ లైసెన్స్ వెంట ఉంచుకోవాలని సూచిస్తున్నారు. లైసెన్స్ లేని వారు వెంటనే సంబంధిత ఆర్టీఏ ఆఫీసు నుంచి దానిని పొందాలని కోరుతున్నారు. కేవలం వాహనం రోడ్లపై నడిపేవారే కాకుండా.. లైసెన్స్ లేని వ్యక్తులకు తమ వాహనాలను ఇచ్చే యజమానులపై కూడా ఇక నుంచి చట్టపరమైన చర్యలుతీసుకోనున్నట్లు పోలీసులు వెల్లడించారు. నిబంధనల ప్రకారం.. వాహనం నడిపే అర్హత లేని వారికి వాహనాలు ఇవ్వడం నేరమని చెబుతున్నారు. దీనివల్ల భారీ జరిమానాలతో పాటుగా ఇతర చట్టపరమైన ఇబ్బందులు సైతం ఎదుర్కోవాల్సి వస్తుందని పోలీసులు హెచ్చరిస్తున్నారు. లైసెన్స్ లేకుండా వాహనం నడుపుతూ ప్రమాదానికి గురైతే.. సదరు వాహనానికి ఇన్సూరెన్స్ క్లెయిమ్ వర్తించదని అంటున్నారు. దీనివల్ల బాధితులకు లేదావాహన యజమానులకు తీవ్రమైన ఆర్థిక భారంతో పాటు చట్టపరమైన చిక్కులు ఎదురవుతాయని చెబుతున్నారు. ప్రజా భద్రత, రహదారి నియమాలపట్ల ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని అంటున్నారు. రోడ్డు ప్రమాదాలను అరికట్టేందుకు పోలీసులకు సహకరించాలని హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసులు కోరుతున్నారు. ఇక ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించి కొందరు వాహనాలు నడుపుతున్నట్లు పోలీసులు గుర్తించారు. పెండింగ్ చలాన్ల నుంచి తప్పించుకోవడానికి నంబరు ప్లేటును ట్యాంపర్ చేస్తున్నట్లు తెలిపారు. అటువంటి వాహనదారులపై నగర ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేక నిఘా పెట్టారు. వాహ నంబర్ ప్లేట్ల అంకెలు మార్చడం, నంబరు ప్లేటుపై మాస్కులు తగిలించడం, అంకెలు స్పష్టంగా కనిపించకుండా రంగు పూయడం వంటి చర్యలకు పాల్పడితే చర్యలు తప్పవంటున్నారు. భారీ జరిమానాతో పాటు క్రిమినల్ కేసులు సైతం ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరిస్తున్నారు.

## దేవుళ్ల దగ్గర 550 కిలోల బంగారం!



హైదరాబాద్: బంగారం ధర పరుగులు పెడుతోంది. సామాన్యులకు అందనంత దూరం వెళ్లిపోయింది. గత ఏడాది క్రితం వరకు తులం రూ. లక్షకు దిగువగా ఉన్న బంగారం ప్రస్తుతం లక్షన్నరకు పైగానే ఉంది. ఈ విషయం అటుంచితే కొందరు భక్తులు తమ ఇష్టదైవాలకు బంగారం సమర్పిస్తుంటారు. బంగారం కొనుగోలు చేసి ఉంగరాలు, కిరీటాలు, కంఠాభరణాలు, ఇతర ఆభరణాలు వంటివి చేయించి దేవుళ్లకు సమర్పిస్తుంటారు. మరికొందరు బంగారు బిస్కెట్లు, నాణేలు, బంగారం ముక్కలను హుండీలో వేస్తుంటారు ఇంకొందరు తమ కుటుంబ వారసత్వంగా వచ్చిన ఆభరణాలనే నేరుగా దేవుడికి అర్పిస్తున్నారు. ఇలా బంగారంతో పాటు వెండి వస్తువులను కూడా దేవుళ్లకు కానుకగా ఇస్తుంటారు. అయితే తెలంగాణలోని ప్రధాన దేవాలయాల వద్ద ఉన్న బంగారం నిల్వలు ఎంతో తెలుసా..? ప్రధాన ఆలయాలైన యాదగిరిగుట్ట లక్ష్మీ నర్సింహ్మ స్వామి, భద్రాద్రి రామయ్య వద్ద ఎంత బంగారం ఉండి ఉంటుందో ఆలోచించారా..? ఆ వివరాలు తాజాగా బయటకు వచ్చాయి. తెలంగాణ వ్యాప్తంగా అన్ని ప్రధాన ఆలయాల్లో కలిపి మె?త్తం 550 కిలోల బంగారం, 29,582 కిలోల వెండి ఉన్నట్లు తాజాగా దేవాదాయశాఖ గుర్తించింది. ప్రస్తుతం బంగారం కిలో ధర దాదాపుగా రూ. 1.50 కోట్లు ఉంది. ఈ లెక్కన 550 కిలోల బంగారం విలువ రూ. 800 కోట్లపైగానే ఉంటుందని దేవాదాయశాఖ అధికారులు చెబుతున్నారు. ఇక 29,582 కిలోల వెండి విలువ కూడా సుమారు రూ. 843 కోట్లుగా ఉందని అంటున్నారు. ఈ రెండూ కలిపితే రాష్ట్రంలోని దేవాలయాల మొత్తం బంగారం, వెండి సంపద విలువ దాదాపు రూ. 1,650 కోట్లకు చేరుతుందని చెబుతున్నారు. యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో మొత్తం 112 కిలోల బంగారం ఉంది. అందులో 65 కిలోలు విమాన గోపురానికి ఉపయోగించగా.. ఇంకా 37 కిలోల బంగారం నిల్వలున్నాయి. మరో 9.768 కిలోలు గోల్డ్ బాండ్ల రూపంలో బ్యాంకుల్లో ఉన్నాయి. 1,742 కిలోల వెండి ఆలయంలో ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఆ తర్వాత భద్రాచలం సీతారామచంద్రస్వామి ఆలయంలో 67.14 కిలోల బంగారం, 1,025.44 కిలోల వెండి ఉన్నాయి. ఇందులో 9 కిలోల బంగారాన్ని గోల్డ్ బాండ్ రూపంలో ఉంచినట్లు అధికారులు తెలిపారు. బాసర సరస్వతి క్షేత్రంలో అమ్మ వారికి 15 కేజీల బంగారం, 821 కేజీల వెండి ఉన్నాయి. ఇందులో 12.34 కేజీల బంగారాన్ని వివిధ బ్యాంకులో గోల్డ్ డిపాజిట్‌గా ఉంచినట్లు దేవాదాయశాఖ అధికారులు తెలిపారు

## జీడీపీలో వైజాగ్ ఫస్ట్



విశాఖపట్టణం, : ఏపీ ప్రభుత్వం జిల్లాల వారీగా స్థూల ఉత్పత్తి, తలసరి ఆదాయం లెక్కలు విడుదల చేసింది. విశాఖపట్నం టాప్ ప్లేస్‌లో నిలిచింది. సీఎం చంద్రబాబు మంత్రులు, కార్యదర్శులతో నిర్వహించిన సమావేశంలో ఈ వివరాలు వెల్లడించారు. రాష్ట్ర స్థూల ఉత్పత్తి, తలసరి ఆదాయం ప్రతి ఐదేళ్లకూ రెట్టింపు అయ్యేలా ప్రణాళికలు చేపట్టాలని చంద్రబాబు అధికారుల్ని ఆదేశించారు. ప్రజల జీవన ప్రమాణాలకు తలసరి ఆదాయం ప్రతీక అని ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు. ఆంధ్రప్రదేశ్‌లో జిల్లాల వారీగా స్థూల ఉత్పత్తి, తలసరి ఆదాయంలో విశాఖపట్నం అదరగొట్టింది.. మొదటి స్థానంలో నిలిచింది. ఎన్టీఆర్ జిల్లా స్థూల ఉత్పత్తిలో రెండో స్థానంలో నిలిచింది. అయితే తలసరి ఆదాయంలో మాత్రం మూడో ప్లేస్‌లో నిలిచింది. ముఖ్యమంత్రి చంద్రబాబు అమరావతిలో సచివాలయంలో మంత్రులు, కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. జాతీయ ఆర్థిక సర్వే, జీఎస్‌డీపీ, జీడీపీలపై అధికారులతో చర్చించారు. ఈమేరకు ప్రభుత్వం జిల్లాల వారీగా స్థూల ఉత్పత్తి, తలసరి ఆదాయం గణాంకాలను (2025–26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ముందస్తు అంచనాలు) విడుదల చేసింది. జిల్లాల వారీగా జీడీపీ ముందస్తు అంచనాలు ఇలా ఉన్నాయి. విశాఖపట్నం– రూ. 1,60,771 కోట్లు, ఎన్టీఆర్ జిల్లా– రూ. 1,05,173 కోట్లు, కృష్ణా జిల్లా–రూ. 98,801 కోట్లు, తిరుపతి జిల్లా–రూ. 98,526 కోట్లు, ఏలూరు జిల్లా–రూ. 88,543 కోట్లు, నెల్లూరు జిల్లా–రూ. 85,444 కోట్లు, గుంటూరు జిల్లా– రూ. 83,618 కోట్లు, కడప జిల్లా– రూ. 79,617 కోట్లు, అనంతపురం జిల్లా– రూ. 76,849 కోట్లు, కాకినాడ జిల్లా–75,342 కోట్లు, పశ్చిమ గోదావరి జిల్లా–రూ. 73,970 కోట్లు, తూర్పుగోదావరి జిల్లా–రూ. 70,512 కోట్లు, శ్రీ సత్యసాయి జిల్లా–రూ. 63,190 కోట్లు, అనకాపల్లి జిల్లా–రూ. 60,146 కోట్లు, కర్నూలు జిల్లా–రూ. 54,452 కోట్లు, పల్నాడు జిల్లా–రూ. 49,596 కోట్లు, చిత్తూరు జిల్లా రూ. 49,303 కోట్లు, నంద్యాల జిల్లా–రూ. 48,531 కోట్లు, బాపట్ల జిల్లా–రూ. 48,457కోట్లు, శ్రీకాకుళం జిల్లా–రూ. 47,663 కోట్లు, ప్రకాశం జిల్లా– రూ. 46,268 కోట్లు, విజయనగరం జిల్లా రూ. 45,085 కోట్లు, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా– రూ. 44,859 కోట్లు, అన్నమయ్య జిల్లా రూ. 36,035 కోట్లు, మార్కాపురం జిల్లా– రూ. 29,031 కట్లు, అల్లూరి సీతారామరాజు జిల్లా రూ. 18,583 కోట్లు, పార్వతీపురం మన్యం జిల్లా రూ. 17,271 కోట్లు, పోలవరం జిల్లా– రూ. 6,723 కోట్లు. జిల్లాల వారీగా తలసరి ఆదాయం చూస్తే.. విశాఖపట్నం– 6,58,091, కృష్ణా–4,82,078, ఎన్టీఆర్ జిల్లా–3,91 ,390.. వరుసగా మూడు స్థానాల్లో ఉన్నాయి'ప్రతీ ఐదేళ్లకూ జీఎస్డీపీ, తలసరి ఆదాయం రెట్టింపు అయ్యేలా ప్రణాళికలు చేపట్టాలి. తలసరి ఆదాయం ప్రజల జీవన ప్రమాణాలకు ప్రతీకగా నిలుస్తుంది. కీ–పెర్ఫార్మెన్స్ ఇండికేటర్ల విషయంలో జాగ్రత్తగా అంచనాలు వేయాలి. క్షేత్రస్థాయి నుంచి తీసుకునే సమాచారం ఒకటికి రెండు సార్లు పరిశీలన చేసుకోవాలి. పీ 4అనేది రాష్ట్రంలో ఆర్థిక అసమానతలు తగ్గించే ప్రత్యేక కార్యక్రమం. మార్గదర్శులు బంగారు మిత్రలను నియమించుకో వాలి.. వారి ద్వారాఆయా పేదకుటుంబాలను ఆదుకునేలాచర్యలు తీసుకో వాలి. గత పాలకులు చేసినఅప్పుల కారణంగా 14 శాతం వడ్డీ చెల్లిస్తున్నాం.

ఏపీ క్రెడిట్ రేటింగ్‌పెంచుకుని వడ్డీ తగ్గించుకునేలా రుణాలన్నీ రీషెడ్యూలు చేస్తున్నాం. గత పాలనలో పాలకులు 2019–24 మధ్య ఆర్థిక క్రమశిక్షణ దెబ్బతీశారు. జీతాలు కూడా మొదటి తేదీకి ఇవ్వలేని పరిస్థితి ఉండేది. ఇప్పుడు జీతాల చెల్లింపులను గాడిలో పెట్టాం.. సూపర్ సిక్స్ పథకాలను అమలు చేస్తున్నాం. కొన్ని జిల్లాల్లో అద్భుతమైన అభివృద్ధి జరుగుతోంది. భవిష్యత్తులో ఆ జిల్లాలు మరింత వృద్ధిలోకి వచ్చే అవకాశాలు కనిపిస్తు న్నాయి' అన్నారు చంద్రబాబు. పారి శ్రామిక కాలుష్యం ద్వారా భూగర్భ జలాలు కలుషితం కాకుండా చూడాలి. సురక్షితమైన తాగునీరు ప్రజలకు అందాలి. ఆశ్రమ హాస్టల్‌లో కలుషితమైన నీరు కారణంగా విద్యార్థులు అస్వస్థతకు గురైన పరిస్థితి ఎదురైంది. ఈ తరహా ఘటనలు ఇక రా ష్ట్రంలో ఉత్పన్నం కాకూడదు. మళ్లీ ఇలాంటి సంఘటనలు జరిగితే... దానికి సంబంధిత జిల్లా కలెక్టర్, ఇంచార్జ మంత్రులదే బాధ్యత. పంచాయితీరాజ్ రోడ్లు, నీటి సంరక్షణా చర్యలు, గోకులం షెడ్లు, మేజిక్ డ్రెయిన్లు చేపట్టాలి' అని సూచించారు.

## మంచిర్యాల జిల్లాలో కొర్రమీను క్లస్టర్

అదిలాబాద్: తెలంగాణలో కొర్రమీను క్లస్టర్ ఏర్పాటు చేయనున్నట్లు కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. మంచిర్యాల జిల్లాలో ఈ క్లస్టర్ ఏర్పాటు చేయనున్నట్లు కేంద్రమంత్రి రాజీవ్ రంజన్ సింగ్ లోక్‌సభలో స్పష్టం చేశారు. దాంతో పాటుగా హైదరాబాద్ నగరంలో అతిపెద్ద హోల్‌సేల్ చేపల మార్కెట్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఇవి అందుబాటులోకి వస్తే తక్కువ ధరకే చేపలు దొరకనున్నాయి. తెలంగాణకు కేంద్రం గుడ్‌న్యూస్ చెప్పింది. రాష్ట్రంలో ప్రత్యేకంగా కొర్రమీను క్లస్టర్ ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించింది. దాంతో పాటుగా నాలుగు పట్టణాల్లో ఫుడ్ స్ట్రీట్ల ఏర్పాటుకు సాయం చేస్తామంది. ఈ మేరకు లోక్‌సభలో కేంద్ర మత్స్యశాఖ మంత్రి రాజీవ్ రంజన్ సింగ్ స్పష్టం చేశారు. వరంగల్ ఎంపీ కడియం కావ్య అడిగిన ప్రశ్నకు బదులిచ్చిన ఆయన ప్రధాన మంత్రి మత్స్య యోజన కింద తెలంగాణలో రూ. 196.80 కోట్ల విలువైన ప్రతి పాదనలకు ఆమోదం తెలిపినట్లు వెల్లడించారు. రాజధాని హైదరాబాద్ నగరంలో అత్యాధునిక హోల్‌సేల్ చేపల మార్కెట్, మంచిర్యాల జిల్లాలో కొర్రమీను ఉత్పత్తి, ప్రాసెసింగ్ క్లస్టర్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారుఇక రాష్ట్రంలోని మరో నాలుగు పట్టణాల్లో హెల్తీ అండ్ హైజీనిక్ ఫుడ్ స్ట్రీట్స్ ఏర్పాటు చేయనున్నట్లు కేంద్ర మంత్రి ప్రతాప రావు జాదవ్ ప్రకటించారు. బీఆర్ఎస్ ఎంపీ సురేష్ రెడ్డి అడిగిన ప్రశ్నకు ఆయన ఈ మేరకు సమాధానం ఇచ్చారు. హైదరాబాద్ శివారు నార్సింగి, వరంగల్, నల్లగొండ, సిద్దిపేటలో జాతీయ ఆరోగ్య మిషన్ కింద వీటిని ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. ఒక్కో ఫుడ్ స్ట్రీట్‌కు రూ. కోటి చొప్పున ఆర్థిక సాయం అందించనున్నట్లు తెలిపారు. పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాల్లోని పత్తి రైతుల కోసం సీసీఐ కొనుగోలు కేంద్రాల సంఖ్యను కూడా పెంచినట్లు కేంద్ర జౌళి శాఖ సహాయ మంత్రి పవిత్ర మార్గరీటా వెల్లడించారు. ఓబీసీ రిజర్వేషన్లకు సంబంధించిన వార్షిక ఆదాయ పరిమితిని పెంచే ప్రతిపాదన ఏదీ తమ వద్ద లేదని కేంద్ర మంత్రి బీఎల్ వర్మ వెల్లడించారు. కాగా, హైదరాబాద్ నగరంలో అతిపెద్ద చేపల మార్కెట్, మంచిర్యాలలో కొర్రమీను క్లస్టర్ ఏర్పాటు చేయటం ద్వారా తక్కువ ధరకే చేపల లభించే ఛాన్స్ ఉంది. ప్రస్తుతం తెలంగాణలోని చెరువులతో పాటు ఏపీ సముద్రతీరం నుంచి ఎక్కువగా చేపలు వస్తుంటాయి. అయితే సుదూర ప్రాంతాల నుంచి చేపలు దిగుమతి చేసుకుంటుండటం వల్ల చేపల ధరలు ఎక్కువగా ఉంటున్నారు.

## విశ్వవిద్యాలయాల్లో తుకిడే గ్యాంగులు..!



న్యూఢిల్లీ: ఢిల్లీలోని జవహర్‌లాల్ నెహ్రూ యూనివ ర్సిటీ భారత వ్యతిరేక కార్యకలాపాలకు కేంద్రంగా ఉంటూ వచ్చింది. తుకిడే గ్యాంగులు ఇందులోనే ఉన్నాయి. పాకిస్తాన్ అనుకూల నినాదాలు బలంగా వినిపించేవి. అక్కడి ప్రొఫెసర్లు కూడా తప్పుడు చరిత్రను నేర్పించారు. పాలస్తీనాకు అనుకూలంగా విద్యార్థుల మైండ్ మార్చి రెచ్చగొట్టే ప్రయత్నం చేశారు. అయితే ఈ యూనివర్సిటీలో కనీ విని ఎరుగని సంఘటన జరిగింది. ఈ యూనివర్సిటీలో విద్యార్థుల ఇష్టారాజ్యం కొనసాగేది. కానీ, గతంలోలాగా ఇప్పుడు నడదు అని అధికారులు షాక్ ఇచ్చారు. గతేడాది నవంబర్ 20న యూనివర్సిటీ లైబ్రరీలో విద్యార్థులు ఫేసియల్ రికగ్నిషన్ వ్యవస్థను ధ్వంసం చేశారు. ఆవేశ ప్రసంగాలు చేశారు. అడ్డుకోబోయిన ఇద్దరు మహిళా కానిస్టేబుళ్లపై దాడి చేశారు. అయితే తాము ఏం చేసినా చెల్లుతుందనే విధంగా వ్యవహరించారు. కానీ, అధికారులు దీన్ని తీవ్రంగా తీసుకుని ప్రొక్టోరియల్ విచారణ ఆదేశించారు. విచారణ నివేదిక అందిన తర్వాత అధికారులు చర్యలు మొదలు పెట్టారు. ఫిబ్రవరి 8న ఐదుగురు విద్యార్థులపై ఏడాది రస్టికేషన్ విధించారు. వీరిలో స్టూడెంట్స్ యూనియన్ సెక్రటరీ గోపిక బాబు, అధ్యక్షురాలు అతిథి మిశ్రా, సునీల్ యాదవ్, డానిస్ అలీ, నితీష్ కుమార్ ఉన్నారు. ఫిబ్రవరి 13 వరకు వర్సిటీ ఖాళీ చేసి వెళ్లిపోవాలని ఆదేశించారు. శిక్ష పూర్తయిన తర్వాత కూడా రూ. 19 వేల జరిమానా చెల్లించాలని పేర్కొన్నారు. జేఎన్‌యూలో భారత వ్యతిరేక కార్యకలాపాలు, తప్పుడు చరిత్ర బోధన, పాక్ అనుకూల నినాదాలు గతంలో సంచలనం చేశాయి. అధికారులు రాజకీయ జోక్యాలు ఆగమాత్రమే కారణంగా కఠిన చర్యలు తీసుకున్నారు. ఆశ్రయం ఇచ్చినవారిపై కూడా చర్యలు హెచ్చరిక. అయితే విద్యార్థులపై చర్యలను నిరసిస్తూ ఒకరోజు బంద్ పాటించారు. కానీ, ఈ చర్యలు జేఎన్‌యూలో మార్పు తీసుకువస్తాయని నిపుణులు భావిస్తున్నారు.

## ఏపీ పరిస్థితి ఇంత దారుణమా...!

గుంటూరు: ఆంధ్రప్రదేశ్‌లో బుధవారం నుంచి అసెంబ్లీ సమావేశాలు ప్రారంభం అయ్యాయి. అయితే ఇంతలో కేంద్రం పార్లమెంట్‌లో పెట్టిన ఓ నివేదిక ఇక్కడ రాజకీయ చిచ్చు రేపింది. ఆంధ్రప్రదేశ్‌లోని రైతు అప్పుల ఊబిలో ఉన్నాడని చెప్పిన రిపోర్టు సంచలనంగా మారుతోంది. అయితే దీన్ని అధికార ప్రతిపక్షాలు ఇరువురు కూడా బురద చల్లేలా ఉందని విశ్లేషకులు చెబుతున్నారు. దేశానికి వెన్నెముక రైతు అని గర్వంగా చెప్పుకునే రైతు అప్పుల భారతంతో కుంగిపోతున్నాడని పార్లమెంట్‌లో కేంద్రం కీలక నివేదిక బయటపెట్టింది. ఆంధ్రప్రదేశ్‌లోని రైతు కుటుంబాలు దేశంలోనే అత్యధిక అప్పుల భారంతో ఉన్నాయనేది చేదు నిజం. కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన తాజా గణాంకాలు చూస్తుంటే ఏపీలో రైతు దీనస్థితి ఏంటో కళ్లకు కట్టినట్టు కనిపిస్తోంది. ఫిబ్రవరి 10న లోక్‌సభలో ఏపీ రైతు అప్పులపైఒక కీలక చర్చ జరిగింది. దీనిపై కేంద్ర వ్యవసా య శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ లిఖిత పూర్వక సమాధానం ఇచ్చారు. ఈ ప్రకటన ద్వారా ఆంధ్రప్రదేశ్‌లో రైతులు ఎంతటి ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నారో దేశానికి స్పష్టమైంది. ప్రభుత్వ లెక్కల ప్రకారం దేశవ్యాప్తంగా ఉన్న రైతులతో పోలిస్తే ఆంధ్రప్రదేశ్ రైతుల అప్పులే అత్యధికంగా ఉన్నట్టు తేలింది. మంత్రి శివరాజ్ సింగ్ వెల్లడించిన గణాంకాల ప్రకారం జులై 2018–జూన్ 2019 మధ్య కాలానికి సంబంధించి ఆంధ్రప్రదేశ్‌లోని ఒక సగటు రైతు కుటుంబం అప్పు 2,35, 554 రూపాయలుగా ఉంది. ఇది కేవలం ఒక అంచనా మాత్రమే కాదు. ప్రభుత్వ రికార్డుల్లో నమోదైన వాస్తవం. అంటే మన రాష్ట్రంలో ఒక సాధారణ రైతు కుటుంబం సుమారు రెండు లక్షల ముప్పై ఐదు వేల రూపాయల అప్పుతో కాలం వెళ్లదీస్తోంది. పక్కనే ఉన్న తెలుగు రాష్ట్రం తెలంగాణతో పోల్చి చూసినా ఏపీ పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. తెలంగాణలో ఒక రైతు కుటుంబం సగటు అప్పు 1,52, 113రూపాయలుగా ఉంది. అంటే ఏపీ కంటే ఇది చాలా తక్కువ. భారత్‌లో మొత్తం మీద ఒక రైతు కుటుంబం సగటు అప్పు కేవలం 74, 121 రూపాయలు మాత్రమే. జాతీయ సగటు 74వేలు ఉంటే ఏపీలో అది 2.35 లక్షలకు చేరడం ఆందోళనకరంగా ఉంది. దేశ సగటు కంటే ఏపీలో రైతులు దాదాపు మూడు రెట్లు ఎక్కువ అప్పుల్లో ఉన్నారని లెక్కలు చెబుతున్నాయి. కేంద్ర మంత్రి ప్రకటన ద్వారా అప్పుల భారం అయితే తెలిసింది కానీ, సామాన్యంగా రైతుకు ఈ తిప్పలు ఎందుకు వస్తాయో అందరికి తెలిసిందే.

పెట్టుబడి పెరగడం, గిట్టుబాటు ధర లేకపోవడం, ప్రకృతి వైపరిత్యాలు వంటి ఎన్నో కారణాలు రైతును అప్పుల వైపు నెడుతున్నాయి. ఒక్కో రైతు కుటుంబంపై ఇంత భారీ స్థాయిలో అప్పు ఉండటం అనేది రాష్ట్ర ఆర్థిక వ్యవస్థపై కూడా ప్రభావం చూపుతుంది. పార్లమెంట్ సాక్షిగా బయటపడిన ఈ లెక్కలు ఇటు టీడీపీపై వైసీపీ దుమ్మెత్తి పోస్తుంటే, వారి హయాంలోనే ఇలాంటి లెక్కలు వెలుగు చూశాయని అప్పటి ప్రభుత్వం చేతకానితనం వల్లే ఇదంతా జరిగిందని కూటమి నేతలు ఆరోపిస్తున్నారు. మొత్తానికి ఈ కేంద్ర విడుదల చేసిన లెక్కలను ఇరు వర్గాలు వాడుకుంటున్నారు.

# 10న లెనిన్ విడుదల




చాలా కాలంగా సరైన బ్రేక్ కోసం ఎదురుచూస్తున్న యాక్టర్లలో ఒకడు టాలీవుడ్ నటుడు అక్కినేని అఖిల్. ఈ సారి ఎలాగైనా హిట్టు కొట్టాలని మేకోవర్ మార్చుకుని లాంగ్ గ్యాప్ తర్వాత 'లెనిన్'గా ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాడు అఖిల్. మురళీ కిషోర్ అబ్బూరి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో మిస్టర్ బచ్చన్ ఫేం భాగ్య శ్రీ బోర్సే హీరోయిన్‌గా నటిస్తోంది. ఈ మూవీ జులై 10న గ్రాండ్‌గా విడుదల కానుంది. ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో చిత్రయూనిట్ చెప్పిన మాటలు లెనిన్ గ్రాండ్ సక్సెస్ అవడం పక్కా అని ఫుల్ కాన్ఫిడెన్స్‌తో ఉన్నట్టు చెప్పకనే చెబుతున్నాయి. ఇదిలా ఉంటే సినిమా థియేటర్లలోకి రాకముందే అప్పుడే ఓటీటీ రిలీజ్‌కు సంబంధించిన ఆసక్తికర వార్తను షేర్ చేశారు మేకర్స్. లెనిన్ పోస్ట్ థియాట్రికల్ రైట్స్‌ను పాపులర్ టెలివిజన్ నెట్‌వర్క్ జీ దక్కించుకుంది. జీ నెట్‌వర్క్ లెనిన్ మూవీ డిజిటల్, శాటిలైట్ రైట్స్‌ను దక్కించుకుంది. థియాట్రికల్ రన్ తర్వాత జీ5లో ప్రీమియర్ కానుంది. అంతేకాదు జీ తెలుగు, జీ సినిమాలులో టెలివిజన్ ప్రీమియర్ కానుంది. ఆయా ఎ÷-లాట్‌ఫాంలలో విడుదల తేదీలపై మేకర్స్ థియాట్రికల్ రిలీజ్ తర్వాత క్లారిటీ ఇవ్వనున్నారు. ఈ మూవీని అన్నపూర్ణ స్టూడియోస్‌తోపాటు సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌లపై అక్కినేని నాగార్జున, నాగ వంశీ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. రొమాంటిక్ యాక్షన్ డ్రామాగా వస్తున్న ఈ చిత్రంలో శివాజీ, సునీల్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన లెనిన్ టైటిల్ గ్లింప్స్ మూవీ విలేజ్ బ్యాక్‌డ్రాప్ నేపథ్యంలో సాగనున్నట్టు హింట్ ఇచ్చేసింది.



# నాగార్జున వందో సినిమాలో టబూ

నెగెటివ్ షేడ్‌లో ఉంటుంది అంటూ ప్రచారం

టాలీవుడ్ కింగ్ నాగార్జున కెరీర్‌లో ప్రతిష్టాత్మకంగా తెరకెక్కనున్న 100వ సినిమాపై అభిమానుల్లో రోజురోజుకూ ఆసక్తి పెరుగుతోంది. ఇటీవల అక్కినేని అఖిల్ నటించిన 'లెనిన్' ప్రీ-రిలీజ్ ఈవెంట్‌లో పాల్గొన్న నాగార్జున, తన మైలురాయి చిత్రం కింగ్100 కు సంబంధించిన అధికారిక అప్‌డేట్‌ను జూలై 10 తర్వాత వెల్లడిస్తానని ప్రకటించారు. దీంతో ఈ ప్రాజెక్ట్‌పై సోషల్ మీడియాలో చర్చలు మరింత వేగం పుంజుకున్నాయి. ఇప్పటివరకు చిత్రబృందం నుంచి అధికారిక ప్రకటన రాకపోయినా, ఇండస్ట్రీ వర్గాల్లో వినిపిస్తున్న తాజా వార్తలు అభిమానుల్లో మరింత ఉత్సాహాన్ని పెంచుతున్నాయి. ముఖ్యంగా ఈ సినిమాలో బాలీవుడ్ స్టార్ హీరోయిన్ టబూ కీలక పాత్రలో కనిపించనున్నట్లు, అంతేకాదు ఆమె ఈసారి నెగెటివ్ షేడ్స్ ఉన్న ప్రధాన ప్రతినాయక పాత్రను పోషించే అవకాశముందని ప్రచారం జరుగుతోంది. గతంలో నాగార్జున, టబూ కలిసి నటించిన సినిమాలు ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. వారి ఆన్‌స్క్రీన్ కెమిస్ట్రీకి ప్రత్యేక అభిమానులు ఉన్నారు. అందుకే ఈసారి కూడా ఇద్దరూ జంటగా కనిపిస్తారని చాలామంది భావించారు. అయితే తాజా ప్రచారం ప్రకారం, టబూ ఈ చిత్రంలో హీరోయిన్‌గా కాకుండా నాగార్జునకు ఎదురుగా నిలిచే ప్రధాన ప్రతినాయకురాలి పాత్రలో నటించనున్నట్లు సమాచారం. ఈ వార్త నిజమైతే, ఇద్దరూ తొలిసారి పూర్తిగా భిన్నమైన పాత్రల్లో తలపడే అవకాశం ఉంటుంది. తండ్రి-కూతురు మధ్య సాగే భావోద్వేగ కథ ఈ సినిమాకు ప్రధాన బలంగా ఉండనుందని టాక్. ఈ చిత్రాన్ని అన్నపూర్ణ స్టూడియోస్ నిర్మిస్తుండగా, యువ నటి సుష్మిత భట్ కీలక పాత్రలో కనిపించనున్నట్లు తెలుస్తోంది. భారీ స్థాయిలో ఈ ప్రాజెక్ట్‌ను రూపొందించేందుకు మేకర్స్ ఇప్పటికే పలుమాసాలుగా సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం. టైటిల్, నటీనటులు, ఫస్ట్ లుక్, షూటింగ్ అప్‌డేట్స్ వంటి కీలక విషయాలపై త్వరలోనే స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

# పారిపోదామనుకున్నా..

**కీర్తి సురేష్ ఆసక్తికర వ్యాఖ్యలు**

ప్రముఖ నటి కీర్తి సురేష్ తన ప్రేమ, వివాహం గురించి గతంలో చేసిన వ్యాఖ్యలు మరోసారి సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్నాయి. ప్రేమించిన వ్యక్తితో పెళ్లికి ఇంట్లో పెద్దలు ఒప్పుకోకపోతే ఇంటి నుంచి వెళ్లి వివాహం చేసుకోవాలని కూడా ఒక దశలో అనుకున్నానని ఆమె వెల్లడించారు. తెలుగు, తమిళ చిత్రాల్లో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న కీర్తి సురేష్, హీరో రామ్ పోతినేని నటించిన 'నేను శైలజ' చిత్రంతో తెలుగు ప్రేక్షకులకు పరిచయమయ్యారు. అనంతరం 'మహానటి' చిత్రంతో విశేష గుర్తింపు పొందిన ఆమె, పలువురు అగ్ర హీరోల సరసన నటించారు. దీర్ఘకాలంగా ప్రేమలో ఉన్న ఆంటోనీ తట్టిల్‌ను కీర్తి సురేష్ 2024లో హిందూ, క్రైస్తవ సంప్రదాయాల ప్రకారం వివాహం చేసుకున్నారు. దాదాపు 15 సంవత్సరాల ప్రేమ తర్వాత వీరిద్దరూ ఒక్కటయ్యారు. ఒక ఇంటర్వ్యూలో కీర్తి మాట్లాడుతూ, తమ ప్రేమ విషయం ఇంట్లో చెబితే పెళ్లికి అంగీకరించరేమోనని మొదట భయపడ్డామని చెప్పారు. అవసరమైతే ఇంటి నుంచి వెళ్లి పెళ్లి చేసుకోవాలని కూడా అనుకున్నామని, అయితే కుటుంబ సభ్యులు తమ ప్రేమను అంగీకరించి ఘనంగా వివాహం జరిపించారని తెలిపారు. తమ పెళ్లి ఇరు కుటుంబాల సమక్షంలో ఎంతో వైభవంగా జరుగుతుందని ఊహించలేదని, అందుకే వివాహ సమయంలో తాము ఇద్దరం భావోద్వేగానికి గురయ్యామని కీర్తి సురేష్ పేర్కొన్నారు. వివాహం అనంతరం కూడా కీర్తి సురేష్ సినీ రంగంలో చురుకుగా కొనసాగుతూ వరుస చిత్రాలతో ప్రేక్షకులను అలరిస్తున్నారు.

# డ్రాగన్ మూవీలో పవర్‌ఫుల్ రోల్‌లో ఎన్టీఆర్



**ఫ్యాన్స్ కోసం భారీ యాక్షన్ ఎపిసోడ్ ప్లాన్**

యంగ్ టైగర్ ఎన్టీఆర్ , సంచలన దర్శకుడు ప్రశాంత్ నీల్ కలయికలో తెరకెక్కుతున్న హై-వోల్టేజ్ యాక్షన్ ఎంటర్‌టైనర్ 'డ్రాగన్'. ఈ మోస్ట్ అవైటెడ్ కాంబినేషన్ కోసం నందమూరి అభిమానులతో పాటు యావత్ సినీ ప్రేక్షకులు ఎంతో ఆసక్తిగా, వెయ్యి కళ్లతో ఎదురుచూస్తున్నారు. ప్రశాంత్ నీల్ మార్క్ ఎలివేషన్స్, ఎన్టీఆర్ పవర్‌ఫుల్ స్క్రీన్ ప్రెజెన్స్ కలబోసి వస్తున్న ఈ సినిమాపై ఇండస్ట్రీలో భారీ అంచనాలు నెలకొన్నాయి. తాజాగా అందుతున్న సమాచారం ప్రకారం, ఈ సినిమా అప్‌డేట్స్ కోసం వేచి చూస్తున్న ఫ్యాన్స్‌కు దర్శకుడు ప్రశాంత్ నీల్ ఒక అదిరిపోయే యాక్షన్ ఎపిసోడ్‌ను ప్లాన్ చేసినట్లు తెలుస్తోంది. ఈ సినిమాలో వచ్చే ఇంటర్వెల్ బ్లాక్ యాక్షన్ సీన్స్ ప్రేక్షకులను థియేటర్లలో సీట్ల నుంచి లేచి నిలబడేలా చేస్తాయని సమాచారం. అభిమానుల అంచనాలకు ఏమాత్రం తగ్గకుండా, వారిని పూర్తిగా దృష్టిలో పెట్టుకుని ప్రశాంత్ నీల్ ఈ భారీ యాక్షన్ ఎపిసోడ్‌ను ఎంతో ప్రతిష్టాత్మకంగా డిజైన్ చేశారట. ఈ ఇంటర్వెల్ ÷ట్‌లో తారక్ విధ్వంసక నటన, సరికొత్త యాక్షన్ స్టంట్స్ నెక్స్ట్ లెవెల్‌లో ఉండబోతున్నాయని టాక్. గతంలో ప్రశాంత్ నీల్ సినిమాల్లోని ఇంటర్వెల్ సీన్స్ ఎంతటి సంచలనం సృష్టించాయో అందరికీ తెలిసిందే. ఇప్పుడు ఎన్టీఆర్‌తో అంతకుమించిన భారీ యాక్షన్ విందును ఆయన సిద్ధం చేస్తున్నట్లు వినికిడి. ఇక ఇటీవల విడుదలైన ఈ సినిమా గ్లింప్స్ వీడియో ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది. ఈ గ్లింప్స్‌లో కథలోని అనేక కీలక పాత్రలను ప్రశాంత్ నీల్ పరిచయం చేసినప్పటికీ, అసలు కథకు మూలమైన మెయిన్ కాన్‌ఫ్లిక్ట్‌ను మాత్రం రివీల్ చేయకుండా చాలా సస్పెన్స్‌గా ఉంచారు. ఈ మెయిన్ కాన్‌ఫ్లిక్ట్ చుట్టూ తిరిగే కథాంశంలోనే హీరోయిన్ కృతి సనన్ క్యారెక్టర్ కూడా ఎంట్రీ ఇస్తుందని తెలుస్తోంది. కథను మలుపు తిప్పే అత్యంత కీలకమైన ట్రాక్‌లో ఆమె పాత్ర కనిపించబోతుండటంతో, సినిమాలో కృతి సనన్ పాత్ర ప్రాధాన్యతపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. సాధారణంగా ప్రశాంత్ నీల్ సినిమా అనగానే అందరికీ ఫుల్ బ్లాక్ అండ్ గ్రే షేడ్ ఫ్రేమ్స్, డార్క్ థీమ్స్ మాత్రమే ఎక్కువగా గుర్తుకొస్తాయి. కానీ ఎన్టీఆర్ 'డ్రాగన్' విషయంలో ఆయన తన రూట్ మార్చినట్లు తెలుస్తోంది. మైత్రీ మూవీ మేకర్స్, ఎన్టీఆర్ ఆర్ట్స్ సంస్థలు సంయుక్తంగా అత్యంత భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్న ఈ చిత్రానికి రవి బస్రూర్ సంగీతం అందిస్తున్నారు. ఈ క్రేజీ చిత్రాన్ని వచ్చే ఏడాది జూన్ 11న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలోకి తీసుకురాబోతున్నారు.

# ఇరుముడితో బిజీ.. అయినా కొత్త సినిమాపై దృష్టి

**శ్రీవిష్ణుతో కలసి మల్టీస్టారర్ కోసం రవితేజ యత్నం**




మాస్ మహారాజా రవితేజ వరుస ప్రాజెక్ట్‌లతో దూసుకుపోతున్నారు. ఈ ఏడాది సంక్రాంతికి ప్రేక్షకులను అలరించిన ఆయన, ఇప్పుడు మరోసారి బిజీ షెడ్యూల్‌తో అభిమానులకు వరుస సినిమాలను అందించేందుకు సిద్ధమవుతున్నారు. ప్రస్తుతం నటిస్తున్న ఆధ్యాత్మిక యాక్షన్ డ్రామా 'ఇరుముడి' చివరి దశ షూటింగ్‌లో ఉండగానే, మరో కొత్త ప్రాజెక్ట్‌కు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు టాలీవుడ్ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. తాజా సమాచారం ప్రకారం, 'రాజా రాజా చోర' ఫేమ్ దర్శకుడు హసిత్ గోలి దర్శకత్వంలో రవితేజ ఓ వినోదాత్మక చిత్రంలో నటించనున్నారని తెలుస్తోంది. ఈ సినిమాలో టాలెంటెడ్ హీరో శ్రీవిష్ణు కూడా కీలక పాత్రలో కనిపించే అవకాశం ఉందని సినీ వర్గాలు చెబుతున్నాయి. హసిత్ గోలి శైలికి తగ్గట్టుగా హాస్యం, వినూత్న కథనం ప్రధాన బలాలుగా ఈ చిత్రాన్ని రూపొందించనున్నట్లు సమాచారం. ఈ నెలలో పూజా కార్యక్రమాలతో సినిమాను ప్రారంభించి, వచ్చే నెల నుంచి రెగ్యులర్ షూటింగ్ ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నారట. వచ్చే ఏడాది సంక్రాంతి కానుకగా చిత్రాన్ని విడుదల చేయాలని మేకర్స్ లక్ష్యంగా పెట్టుకున్నట్లు టాక్ వినిపిస్తోంది. అయితే ఈ మల్టీస్టారర్ ప్రాజెక్ట్‌పై చిత్రబృందం నుంచి ఇప్పటివరకు అధికారిక ప్రకటన వెలువడలేదు. ఇదిలా ఉంటే, రవితేజ అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న 'ఇరుముడి' చిత్రం విడుదలకు సిద్ధమవుతోంది. దర్శకుడు శివ నిర్వాణ తెరకెక్కిస్తున్న ఈ సినిమా భక్తి, కుటుంబ భావోద్వేగాలు, యాక్షన్ అంశాల మేళవింపుగా రూపొందుతోంది. ఈ చిత్రాన్ని ఆగస్టు 21న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నట్లు ఇప్పటికే ప్రకటించారు. ఈ సినిమాలో రవితేజ సరసన ప్రియా భవానీ శంకర్ కథానాయికగా నటిస్తుండగా, మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్‌పై నవీన్ యెర్నేని, వై. రవిశంకర్ నిర్మిస్తున్నారు. ఇటీవల విడుదలైన 'ఇరుముడి కట్టు.. శబరిమల ఎక్కు' పాటకు ప్రేక్షకుల నుంచి విశేష స్పందన లభిస్తోంది. ముఖ్యంగా అయ్యప్ప స్వామి భక్తులను ఈ పాట బాగా ఆకట్టుకుంది. జి.వి. ప్రకాష్ కుమార్ అందించిన సంగీతం, కళ్యాణ్ చక్రవర్తి రచించిన సాహిత్యం, గాయకుడు అనంతు ఆలపించిన తీరు పాటకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

Printed, Published & Owned by JERIPOTHULA SAMPATH, Printed at SRI BALAJI, H.No. 4-4-85, Tilak road, District Karimnagar. 505 001 (T.S)Published at H.No. 3-6-307, Subhash Nagar, Karimnagar MDI: District, Karimnagar -505 001 (T.S) Editor: JERIPOTHULA SAMPATH, RNI NO. APTEL/2012/53127 CELL:9912758107, telanganavanil@gmail.com